# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 124 | విశాఖపట్నం | 4-2-2026 బుధవారం | చీఫ్ ఎడిటర్ : శ్రీనివాస్ లెక్కల | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 124 | VISAKHAPATNAM | 4-2-2026 WEDNESDAY | CHIEF EDITOR: SRINIVAS LEKKALA | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్ PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.
అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.
ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902




4లో

## అలాంటి వారికి పోలీసు ట్రీట్‌మెంట్ ఖాయం.. మంత్రి అనిత వార్నింగ్



4లో

## నేడు జీవీఎంసీ బడ్జెట్ సమావేశం



7లో

## షుగర్ ఉన్నవారు జాగ్రత్తలను పాటించాలి!

## తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం .. విచారణ కమిషన్‌కు

# కేబినెట్ గ్రీన్ సిగ్నల్

- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ కీలక నిర్ణయం
- సిట్ నివేదిక, ఛార్జ్‌షీట్‌లో తేడాలు ఉన్నట్టు గుర్తింపు
- అసలు వాస్తవాలు తేల్చి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశం




**అమరావతి, పతాకం న్యూస్:** తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారంపై అసలు సూత్రధారుల్ని తేల్చేందుకు విచారణ కమిషన్ వేయాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో నిర్వహించిన మంత్రివర్గంలో సిట్ నివేదికపై చర్చ కొనసాగింది. అన్ని అంశాలు పక్కనపెట్టి మరీ తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై చర్చించారు. లడ్డూ కల్తీ జరిగిన విధానం, వివిధ విభాగాల తప్పిదాలను వివరిస్తూ నివేదిక ఉంది. ఇందులో ప్రభుత్వానికి సిట్ సమర్పించిన నివేదికలో పాత్రధారులపై మాత్రమే సిఫార్సు చేసిందని ఏపీ మంత్రివర్గం అభిప్రాయపడింది. అసలు సూత్రధారుల్ని తేల్చేందుకు విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. విచారణ అంశాలకు, ఛార్జ్ షీట్?లో ఉన్న అంశాలు, ప్రభుత్వానికి సమర్పించిన అంశాల్లో తేడాలను మంత్రివర్గం గుర్తించింది. విచారణలో ఉన్న వాస్తవాలు ఛార్జ్ షీట్‌లో ఎందుకు మిస్ అయ్యాయనే దానిపై ప్రధానంగా చర్చ జరిగింది. విచారణ అంశాలు, ఛార్జ్ షీట్‌లో అంశాలు, ప్రభుత్వ నివేదికలో తేడాలపై అధ్యయనం చేసి వాస్తవాలను సమర్పించేందుకు విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ ద్వారా విచారణ బృందం ఏర్పాటు చేసి నిర్ణీత కాలపరిమితిలో నివేదిక తెప్పించుకోవాలని మంత్రివర్గం నిర్ణయించింది. తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారంలో నివ్వెరపోయే నిజాలు వెలుగు చూశాయని కేబినెట్ సమావేశం అనంతరం మంత్రులు మీడియాకు వివరించారు. తప్పు జరుగుతోందని తెలిసినా నాటి పాలకులు మౌనంగా ఉన్నారని స్పష్టమవుతోందన్నారు. సిట్ నివేదికతో పాటు ప్రభుత్వానికి అందుబాటులో ఉన్న సమాచారం పైనా సుదీర్ఘంగా చర్చించామన్నారు. తిరుమల లడ్డూలో పందికొవ్వు కలిసిందని ఎన్డీడీబీ ఇచ్చిన నివేదిక ఆధారంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారని పయ్యావుల గుర్తు చేశారు. బీఫ్ టాలో, లార్డ్, ఫిష్ ఆయిల్ లడ్డూకి వాడిన రసాయనాల్లో వాడినట్లు ఎన్డీడీబీ నిర్ధారించిందని వెల్లడించారు. తన వద్దకు వచ్చిన వాస్తవాలు సీఎం ప్రజల ముందు పెట్టాలా వద్దా అని ప్రశ్నించారు. ఎన్డీడీబీ నివేదిక తరహాలోనే లడ్డూలో రసాయనాల వాడకంపై 2022 వైఎస్సార్సీపీ హయాంలోనే సీఎఫ్టీఆర్ఐ నాటి ప్రభుత్వానికి ఇచ్చిందన్నారు. ఆ నివేదిక ఆధారంగా నాటి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోగా మరింత ప్రోత్సహించటాన్ని ఏమి అనాలని నిలదీశారు. చుక్క పాలు లేకుండా నెయ్యి అంటూ రసాయనాలు తయారు చేసిన విధానంపై ప్రజల్లో చర్చ జరగాలని పిలుపునిచ్చారు. ఫేక్ డాక్యుమెంట్స్ తో వైష్ణవి డెయిరీ నెయ్యి కొనుగోళ్ల టెండర్లలో (తరువాయి 2వ పేజీలో)



## చట్టాలను చంద్రబాబు చేతిలోకి తీసుకున్నారు: రజని

2లో



4లో

## వాట్సప్ గోప్యతా పాలసీపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు

## అధిక ధరలకు మద్యం విక్రయిస్తే

# చర్యలు: పవన్



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీలో అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారంటూ వస్తున్న ఫిర్యాదులపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్(ట్విట్టర్) వేదికగా ట్వీట్ పెట్టారాయన. కాకినాడ జిల్లాతోపాటు రాష్ట్రం నలుమూలల నుంచి ఈ తరహా ఫిర్యాదులు వస్తున్నాయని ప్రస్తావించారు. అధిక ధరలకు మద్యం విక్రయాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. అది ప్రభుత్వానికి చెడ్డ పేరు కూడా తెస్తోందని పేర్కొన్నారు. మద్యం విక్రయాల వ్యవహారంలో దుకాణదారులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని ఆదేశించారు. సంబంధిత శాఖ అధికారులు మద్యం దుకాణాలపై నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని మార్గనిర్దేశం చేశారు. అధిక ధరలకు విక్రయించే మద్యం వారిపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులకు పవన్ కల్యాణ్ సూచించారు.

## పెద్దపులి సంచారంపై ఆందోళన వద్దు : దుర్గేష్



**అమరావతి, పతాకం న్యూస్:** తూర్పు గోదావరి జిల్లా రాజానగరం సమీపంలో పెద్ద పులి సంచారంపై ఆందోళన అక్కర్లేదని, పులిని బంధించేందుకు అటవీ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ట్రాప్, డ్రోన్ కెమెరాలు, బోనులు ఏర్పాటు చేసినట్లు మంత్రి కందుల దుర్గేష్ ప్రజలకు సూచించారు. మంగళవారం కేబినెట్ అనంతరం మంత్రి దుర్గేష్ ఈ విషయమై జిల్లా అటవీ (తరువాయి 2వ పేజీలో)



## ప్రధాని మోడీ రాజీపడ్డారు : రాహుల్‌గాంధీ

2లో


పతాకం న్యూస్ APTEL/25/A2082 PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్ APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## వివక్ష

ఉన్నత విద్యా సంస్థల్లో వివక్షను అరికట్టేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యు.జి.సి) 'ఉన్నత విద్యా సంస్థల్లో సమానత్వ ప్రోత్సాహక నియమావళి-2026: (హెచ్.ఇ.ఐ.ఎస్) మార్గదర్శకాలు విడుదల చేసింది. దీని ప్రధాన ఉద్దేశం మతం, జాతి, లింగం, జన్మస్థలం, వైకల్యం ఆధారంగా వివక్ష లేకుండా చూడటం. ముఖ్యంగా ఆర్థిక, సామాజిక బలహీన వర్గాల పట్ల వివక్షను, కుల ఆధారిత వివక్షను నిలువరించడం దీని లక్ష్యం. వివక్షకు వ్యతిరేకంగా సుదీర్ఘ కాలం జరిగిన పోరాటాలవల్ల ఈ మార్గదర్శకాలు వెలువడ్డాయి. అంతేగాని, ఇవేవీ బహుమతిగా వచ్చి పడినవి కాదు. ఈ మార్గదర్శకాలు పెద్ద చర్చకే దారితీశాయి. ఉన్నత వర్గాలవారు తీవ్రంగా నష్టపోతారని కొందరు...'ఇప్పటికే 2012 మార్గదర్శకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ సెల్స్ ఉన్నాయి. మరి ఈ నూతన నిబంధనలు ఎందుకని?' మరికొందరు వాదిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ సిటీ మేజిస్ట్రేట్ అధికారి అలంకార్ అగ్నిహోత్రి ఏకంగా తన పదవికే రాజీ నామా చేశారు. పలు సవరణలు చేయాలని కొందరు కోరు తున్నారు. అసలు ఈ మార్గదర్శకాలు ఏం చెబుతున్నాయి? నిజంగా వీటి ద్వారా విద్యాసంస్థల్లో వివక్షను పోగొట్టగ లమా? వీటి అమలు ఎలా ఉండబోతోంది? మరోవైపు సుప్రీంకోర్టులో ప్రజావ్యాజ్యం దాఖలైంది. వాదనలు విన్న కోర్టు స్టే విధించింది. దీనితో నూతన మార్గదర్శకాలలో ఎటువంటి మార్పులు జరుగుతాయనేది పెద్ద ప్రశ్నగానే మారింది. దేశంలో వివక్ష ఈ నాటిది కాదు. కులం పేరుతో, జాతి పేరుతో, లింగం పేరుతో వందల ఏళ్ళగా వివక్ష కొనసాగు తున్నది. వివక్ష కారణంగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారంటే నమ్మగలమా? కానీ ఇది అక్షర సత్యం. పుట్టుకనే ఒక "ఘోర ప్రమాదం"గా అభివర్ణించి వారిని ఆత్మహత్య చేసుకునే విధంగా పురికొల్పుతున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో రోహిత్ వేములపై ఇటువంటి దారుణమే జరిగింది. ముంబై లోని బివైఎల్ నాయర్ హాస్పిటల్‌లో పి.జి వైద్య విద్యార్థిని పాయల్ తాడ్వి గిరిజన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అవడంతో తోటి డాక్టర్ల వేధింపులు భరించలేక బలవన్మరణానికి పాల్పడ్డారు. దర్శన్ సోలంకి కూడా బలవన్మరణానికి పాల్పడ్డారు. సోలంకి 2023 ఐఐటి బాంబేలో మొదటి సంవత్సరం బి.టెక్ విద్యార్థి. తన కులం తెలిసిన తర్వాత తోటి విద్యార్థుల ప్రవర్తనలో మార్పు వచ్చిందని, వివక్ష ఎదురవుతోందని కుటుంబ సభ్యులతో వాపోయిన కొద్దిరోజులకే ఆత్మహత్య చేసుకు న్నారనే అంశాలకు కోర్టు విస్తుపోయింది. నూతన ఆలో చనలకు కేంద్రాలుగా ఉండాల్సిన విద్యాసంస్థలు కుల వివక్ష కారణంగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం చేదు నిజం. ఇలాంటి కేసులపై కోర్టులు ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా యుజిసి మార్గదర్శకాలు తయారు చేసింది. కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారమే 2014 నుండి 2021 మధ్య కాలంలో ఐఐటిలు, ఐఐఎంలు వంటి ఉన్నత విద్యాసంస్థల్లో 122 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా, వారిలో ఎస్సీ, ఎస్టీ, ఒబిసి సామాజిక వర్గాలకు చెందినవారే ఉన్నారు. యుజిసి గణాంకాల ప్రకారం ఈ దశాబ్ద కాలంలో కుల వివక్ష ఫిర్యాదులు 118 శాతం పెరిగాయి. విద్యార్థుల నమోదులో 14 శాతం ఎస్సి వర్గాల విద్యార్థులు ఉంటే, అధ్యాపక వృత్తి వచ్చేసరికి కేవలం 6 శాతానికి పడిపో తోందని అఖిల భారత ఉన్నత విద్యా సర్వే-2025 (ఎ.ఐ .ఎస్.హెచ్.ఇ) గణాంకాలు చెబుతున్నాయి. 2012 మార్గదర్శకాల ప్రకారం ఇప్పటికే అనేక కేంద్ర విశ్వవిద్యా లయాల్లో ఎస్సి, ఎస్టి సెల్స్, యాంటీ ర్యాగింగ్ కమిటీలు, అంతర్గత ఫిర్యాదుల కమిటీలు, గ్రీవెన్స్ పోర్టళ్లు ఉన్నాయి. అయినప్పటికీ ఇన్ని వందల మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారంటే వాటి అమలు అసంబద్ధంగా ఉండమే ఇందుకు ప్రధాన కారణం. యూనివర్సిటీలు, కాలేజీల్లో వెనుకబడిన వర్గాల విద్యార్థులకు అండగా ఉండటమే ఈ నిబంధనల ప్రధాన ఉద్దేశమని ఇప్పటికే యుజిసి స్పష్టం చేసింది. అయితే దీని ప్రకారం దేశంలోని ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలలో 'ఈక్వల్ ఆపర్చునిటీ సెంటర్' (ఇ.ఓ.సి) ఏర్పాటు చేయడం తప్పనిసరి. వివక్షపై ఫిర్యాదులకు 24 గంటల హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలి. విచారణ గడువు లోపల ముగించాలి. దోషులుగా తేలితే శిక్షలు కఠినంగా అమలు చేయాలి. అవసరమైతే సంస్థలకు గుర్తింపు రద్దు చేయాలి. లేదా నిధులను ఆపేయాలి. దీనిలో ముఖ్యమైనది ఈ సెంటర్లలో ఎస్సీ, ఎస్టీ, ఒబిసి, మహిళలు, వికలాంగులకు ప్రాతినిధ్యం ఉంటుంది. 2012 నాటి నిబంధనల మాదిరిగా కాకుండా...నూతన నిబంధనలను ప్రజాస్వామ్యబద్ధంగా అమలు చేయాలి. ఐఐటి, ఐఐఎం, ఎయిమ్స్ లాంటి ఉన్నత విద్యాసంస్థల్లో అమలు జరిగేలా అవసరమైన మార్పులు చేయాలి. ఈక్విటీ ఆపర్చునిటీ సెల్స్ విభాగాలు వర్శిటీల వైస్ ఛాన్సలర్ల అధీనంలో కాకుండా...నిష్పాక్షిక ప్రతినిధులతో ఉండాల్సిన అవసరం ఉంది. విశ్వవిద్యాలయ పరిపాలనతో సంబంధం లేని ఎస్సి, ఎస్టి, ఓబిసి ప్రతినిధులు మెజారిటీగా ఉండే ఒక స్వతంత్ర చట్టబద్ధమైన కమిటీ ఉండాలి. విద్యార్థి ప్రతినిధులను 'మెరిట్' ఆధారంగా నామినేట్ చేయకుండా ఎన్నికల ద్వారా ఎన్నుకోవాలి.

## అంతర్ రాష్ట్ర రహదారికి మోక్షం



**సీలేరు, పతాకం న్యూస్:** సీలేరు అంతర్ రాష్ట్ర ప్రధాన రహదారికి మోక్షం కలిగింది. అత్యంత అధ్వానంగా తయారైన ఆర్‌వీనగర్- పాలగెడ్డ రహదారి 43.6 కిలోమీటర్ల మేర నిర్మాణానికి కూటమి ప్రభుత్వం రూ.18.65కోట్లు విడుదల చేయడంతో ఆర్ అండ్ బీ అధికారులు పనులు ప్రారంభించారు. నాలుగు రీచ్‌లుగా పనులు చేపడుతున్నారు. తొలి విడతగా ఆర్‌వీనగర్- లంకపాకలు రీచ్‌లో పనులు ప్రారంభించారు. వర్షాలు ప్రారంభానికి ముందుగానే రహదారి నిర్మాణం పూర్తి చేయాలనే లక్ష్యంతో ఆర్‌అండ్‌బీ అధికారులు పనులను వేగవంతం చేశారు. ఆర్‌వీనగర్ నుంచి పాలగెడ్డ వరకు ఉన్న రహదారిని గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. రహదారిపై ఏర్పడిన గోతులను సైతం పూడ్చలేదు. దీంతో ఈ మార్గంలో పలు చోట్ల భారీ గోతులు ఏర్పడి, రహదారి ఆనవాళ్లు లేకుండాపోయింది. దీంతో గిరిజన సంఘాలు, ఆదివాసీ జేఏసీ నాయకులు 2022 నుంచి 2024 వరకు దశలవారీగా పాదయాత్రలు, ఆందోళనలు, నిరసనలు చేసినప్పటికి గత వైసీపీ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. 2024 సెప్టెంబరు 8వ తేదీన కురిసిన వర్షానికి సీలేరు- ఆర్‌వీనగర్ రహదారి అస్తవ్యస్తమైపోయింది. వరద ప్రవాహానికి రహదారిపైకి కొండచరియలు, వృక్షశకలాలు కొట్టుకువచ్చాయి. పలు చోట్ల రహదారి పూర్తిగా కోతకు గురైంది. కల్వర్టులు కొట్టుకుపోయాయి. సంపంగిగొంది నుంచి సీలేరు వరకు పలు చోట్ల రహదారి శిథిలమైపోవడం వల్ల పది రోజుల పాటు ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ఆర్‌అండ్‌బీ అధికారులు పది రోజులు శ్రమించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేశారు. కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో ఆర్‌వీనగర్ నుంచి పాలగెడ్డ వరకు రహదారి నిర్మాణ పనులను ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రారంభించారు. తొలివిడతగా మొదటి రీచ్ ఆర్‌వీనగర్ నుంచి లంకపాకలు వరకు 13.6 కిలోమీటర్ల మేర పనులను ప్రారంభించారు. ఈ రీచ్ పూర్తికాగానే రెండో రీచ్ రెయిన్‌గేజ్ నుంచి ధారాలమ్మ దేవాలయం వరకు ఐదు కిలోమీటర్లు, మూడో రీచ్ ధారాలమ్మ దేవాలయం నుంచి చల్లనిశిల్ప 15 కిలోమీటర్లు, నాల్గవ రీచ్ సీలేరు నుంచి పాలగెడ్డ వరకు 10 కిలోమీటర్ల పనులు చేపట్టనున్నారు. ప్రస్తుతం భారీ గోతులను మెటల్‌తో పూడ్చి వేస్తున్నారు. నెలాఖరు నాటికి తారు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు.

## ప్రధాని మోడీ రాజీపడ్డారు : రాహుల్‌గాంధీ





**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ విషయంపై లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ప్రధాని మోడీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన అమెరికాతో రాజీపడ్డారని, అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందం ద్వారా దేశాన్ని అమ్మేస్తారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మంగళవారం పార్లమెంటు వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. 'మోడీ గారు కంగారుపడ్డారు. గత కొన్ని నెలలుగా నిలిచిపోయిన (అమెరికా -- భారతదేశం) వాణిజ్య ఒప్పందంపై నరేంద్ర మోడీ నిన్న రాత్రే సంతకం చేశారు. ఈ ఒప్పందం గురించి ఆయనపై తీవ్ర ఒత్తిడి ఉంది. ఈ ఒప్పందం వల్ల నరేంద్ర మోడీ ఇమేజ్ దెబ్బతినే అవకాశం ఉంది. ఇక్కడ ప్రధాన విషయం ఏమిటంటే.. మన ప్రధానమంత్రి రాజీ పడ్డారు. దీనిపై ప్రజానీకం ఆలోచించాలి' అని అన్నారు. అలాగే సభలో మొదటిసారి.. లోక్‌సభ ప్రతిపక్షనేతని రాష్ట్రపతి ప్రసంగంపై మాట్లాడటానికి అనుమతించలేదు. నరేంద్రమోడీ ఈ వాణాజ్య ఒప్పందంలో మీ కష్టాన్ని అమ్మేశారు. ఎందుకంటే ఆయన రాజీపడ్డారు. ఆయన దేశాన్ని కూడా అమ్మేశాడు. ఇప్పుడు నరేంద్రమోడీజీ భయపడుతున్నాడు. ఎందుకంటే ఆయన ఇమేజ్‌ని రూపొందించినవారే.. ఇప్పుడు ఆ ఇమేజ్‌ను బద్దలు కొడుతున్నారు అని రాహుల్ మీడియాతో అన్నారు.

ఈ విషయంపై మీడియా.. 'మోడీ ఎందుకు రాజీపడ్డారని' మీరు భావిస్తున్నారు అని మీడియా రాహుల్‌ని ప్రశ్నించగా.. అమెరికాలో అదానీజీపై ఓ కేసు ఉంది. నిజానికి అది మోడీ జీ మీద కూడా ఉంది. ఎపిస్టిన్ ఫైల్స్ అమెరికా ఇంకా విడుదల చేయని మరిన్ని విషయాలు ఉన్నాయి. దానివల్ల కూడా మోడీపై ఒత్తిడి ఉంటుంది. ఈ రెండు విషయాల వల్ల మోడీ ఒత్తిడికి గురై రాజీపడ్డారని నా అభిప్రాయం. దేశం దీనిని అర్థం చేసుకోవాలి' అని రాహుల్ అన్నారు.

## మినిమం బ్యాలెన్స్ రూల్.. మూడేళ్లలో బ్యాంకులకు రూ.8 వేల కోట్ల ఆదాయం

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:**




బ్యాంకు ఖాతాల్లో ఎల్లప్పుడూ మినిమం బ్యాలెన్స్ ఉంచాలని, ఆ మొత్తం లేకుంటే బ్యాంకులు చార్జీలు వసూలు చేస్తాయని తెలిసిందే. ఇలాంటి ఖాతాల నుంచి బ్యాంకులకు పెద్ద మొత్తం వచ్చిందని కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి తెలిపారు. మూడేళ్లలో 11 ప్రభుత్వరంగ బ్యాంకులకు ఇలా మినిమం బ్యాలెన్స్ చార్జీల కింద రూ.8,092 కోట్లు వసూలైందని చెప్పారు. 2022-23లో రూ.2,407.82 కోట్లు, 2023-24లో రూ.2,909.1 కోట్లు, 2024-25లో రూ.2,775.91 కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. ఇక, ఎస్ఎంఎస్ ఛార్జీల కింద కస్టమర్ల నుంచి రూ.3,387.77 కోట్లు, పాన్ - ఆధార్ కార్డు లింక్ లో జాప్యానికి ఆలస్య రుసుము కింద రూ.2,335.75 కోట్లు, ఆలస్యంగా రిటర్న్‌లు దాఖలు చేసిన వారి నుంచి ఫైన్ రూపంలో రూ.7,664.94 కోట్లు వసూలు చేసినట్లు లోక్‌సభలో మంత్రి వెల్లడించారు

## చట్టాలను చంద్రబాబు చేతిలోకి తీసుకున్నారు: రజని



**గుంటూరు, పతాకం న్యూస్:** మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు విడదల రజనిపై పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. కేసు నమోదైన తర్వాత రజని మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తిరుమల లడ్డూలో కల్తీ జరగలేదని... ఆ విషయంలో క్షమాపణ చెప్పాలని వైసీపీ అడుగుతున్నందున చంద్రబాబు హింసను రాజేస్తున్నారని మండిపడ్డారు. అంబటి రాంబాబు, జోగి రమేశ్ పై ఒక ప్లాన్ ప్రకారమే దాడి చేస్తున్నారని విమర్శించారు. అంబటి రాంబాబు ఇంటి మీదకు మళ్లీ వస్తాం... మళ్లీ కొడతామని ఎమ్మెల్యే మాధవి అంటున్నారని రజని మండిపడ్డారు. అసలు మీ పార్టీలో మీ పరిస్థితి ఏమిటో చూసుకోవాలని అన్నారు. అంబటి రాంబాబుకు సినిమా చూపిస్తామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వార్నింగ్ ఇస్తున్నారని... రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఎక్కడకు వెళుతోందని ప్రశ్నించారు. తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలవలేదని సీబీఐ చెప్పిందని తెలిపారు. చంద్రబాబుకు మంచి బుద్ధి ఇవ్వాలని పూజలు చేసేందుకు వెళితే... తనపై, తన అనుచరులపై ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు దాడి చేయించారని రజని ఆరోపించారు. తమపై దాడి చేసి, తమపైనే కేసులు పెట్టించారని దుయ్యబట్టారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ... చట్టాలను చంద్రబాబు చేతిలోకి తీసుకున్నారని విమర్శించారు. వైసీపీ నేతల ఇళ్లపై దాడి చేస్తు న్నారని... మహిళలపై కూడా దాడులకు తెగబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ మహిళ అయిన తనపై అనేక సార్లు దాడులు చేశారని రజని మండిపడ్డారు. మాజీ మంత్రి అయిన తన పరిస్థితి ఇలా ఉంటే... సామాన్య మహిళల పరిస్థితి ఏమిటని అన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## కేబినెట్ గ్రీన్ సిగ్నల్

పాల్గొంటోందని తెలిసి కూడా నాడు మౌనం వహించిన వారంతా నేరస్థులేనని వ్యాఖ్యానించారు. ఘోరమైన నేరంలో భాగస్వాములైన వారిపై చర్యలు తీసుకోవడం కోసమే విచారణ కమిషన్ ఏర్పాటు చేస్తున్నామని తేల్చి చెప్పారు. తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారంలో పారదర్శత కోసమే ప్రభుత్వ ప్రయత్నం తప్ప రాజకీయ కోణం ఇందులో లేదు. తిరుమల శ్రీవారి పవిత్రత కాపాడే ప్రయత్నమే కూటమి ప్రభుత్వం చేస్తోంది. తిరుమల లడ్డూలో కల్తీ జరిగింది కానీ జంతు కొవ్వు లేదన్నట్లు వైఎస్సార్సీపీ నేతల మాటలు ఉన్నాయి. లడ్డూలో కల్తీని వైఎస్సార్సీపీ సమర్థిస్తోందా? 250కోట్ల అవినీతి కోసం భక్తుల మనోభావాలతో ఆడుకున్నారు. హిందూ ధర్మం మూలలను దెబ్బతీసే విధంగా వైసీపీ చర్యలు ఉన్నాయి. అజెండా అంశాలు పక్కన పెట్టి మరీ కల్తీ లడ్డూ వ్యవహారంపైనే చర్చించామని మంత్రులు పయ్యావుల కేశవ్, పార్థసారథి, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ తెలియజేశారు. వైఎస్సార్సీపీ హయాంలో టెండర్ నిబంధనల్ని సడలించటంతోనే కల్తీకి బీజం పడిందని కేబినెట్ అభిప్రాయపడింది. ఈవోగా ఉన్న సింఘాల్ సడలించిన నిబంధల్ని తిరస్కరించే విచక్షణాధికారం ఉన్నప్పటికీ ఆ దిశగా నిర్ణయం తీసుకోకపోవటాన్ని మంత్రివర్గం తప్పుబట్టింది. వైఎస్సార్సీపీ హయాంలో 2022లో చేయించిన సీఆర్టీఐ నివేదికలోనే కల్తీ నిర్ధారణ అయినా చర్యలు తీసుకోకపోవటాన్ని మంత్రివర్గం తప్పుబట్టింది. సిట్ నివేదికతోపాటు ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారంపై కేబినెట్ లోతుగా చర్చించింది. లడ్డూలో రసాయనాలు వాడకం అంశంలో విస్తుపోయే అంశాలు బయట పడుతున్నాయని మంత్రులు తెలిపారు. అడ్వకేట్ జనరల్‌ను మంత్రివర్గం కేబినెట్‌కు పిలిపించింది. సిట్ ఇచ్చిన నివేదిక ఆధారంగా న్యాయపరంగా తీసుకోవాల్సిన చర్యలపై అడ్వకేట్ జనరల్‌తో చర్చించారు. నివేదికలోని ప్రతి అంశంపై లోతుగా మంత్రివర్గంలో చర్చించారు. వైఎస్సార్సీపీ హయాంలో కొనుగోలు కమిటీలో తాను, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సభ్యులుగా ఉన్నా తమని సమావేశానికి కనీసం ఆహ్వానించలేదని మంత్రి పార్థసారథి క్యాబినెట్ దృష్టికి తీసుకొచ్చారు. తమను పిలవకపోగా కొనుగోలు కమిటీలో సభ్యులు కానీ కరుణాకర్?ిడ్డి పాల్గొన్న విషయాన్ని మంత్రివర్గానికి పార్థసారథి వివరించారు. ఈ కమిటీలో సభ్యులుగా ఉన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కమిటీలో లేని కరుణాకర్‌రెడ్డిలు నిబంధనలు సడలించి కల్తీకి తెరలేపారని మంత్రివర్గం అభిప్రాయపడింది. కల్తీ రసాయనాలతో 20 కోట్ల లడ్డూలను తయారుచేసి పంపిణీ చేయటాన్ని తీవ్రంగా మంత్రివర్గం తప్పుబట్టింది. అయోధ్య రామమందిరంకు సైతం అవే కల్తీ లడ్డూలు సరఫరా చేయటాన్ని మంత్రివర్గం మహాపాపంగా తెలిపింది. సీఎం చంద్రబాబు కూటమి మంత్రులందరితో విడిగా భేటీ అయ్యారు. కేబినెట్ అజెండా అంశాలు పక్కన పెట్టి సమావేశమయ్యారు. సీఎంతో భేటీలో పవన్ కల్యాణ్, సత్యకుమార్, నారా లోకేశ్‌లు పాల్గొన్నారు. అజెండా అంశాలను పక్కన పెట్టి తిరుమల శ్రీవారి లడ్డూపై సిట్ ఇచ్చిన నివేదికపై చర్చించాలని నిర్ణయించారు. సిట్ ప్రభుత్వానికి రాసిన 14 పేజీల లేఖలోని చివరి పేరాలో కల్తీ నెయ్యి సరఫరాకు సంబంధించి అప్పట్లో ఉన్నత స్థానాల్లో ఉన్న ముగ్గురు అధికారులపై చర్యలు తీసుకోవాలని సూచించింది. నెయ్యి సరఫరాకు ఉన్న నాణ్యతా ప్రమాణాలను బలహీనపరిచేలా వ్యవహరించారని, నిబంధనల తయారీలో మనసు పెట్టకుండా పనిచేశారని పేర్కొంది. దీనివల్ల నెయ్యి నాణ్యతలోనూ రాజీ జరిగిందని తెలిపింది. తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యి సరఫరాకు 2019 ముందున్న కఠిన నిబంధనలను వైఎస్సార్సీపీ అధికారంలోకి రాగానే మార్చేశారు. టెండర్లలో పాల్గొనే డెయిరీలు పాలు సేకరించాల్సిన అవసరం లేదని, వెన్న సేకరణ, నెయ్యి ఉత్పత్తి సామర్థ్యంతో పని లేదని సడలించారు. మూడేళ్లపాటు కార్యకలాపాలు నిర్వహించాలనే నిబంధనకు మినహాయింపు ఇచ్చారు. టర్నోవర్ మొత్తాన్ని రూ. 250 కోట్ల నుంచి రూ.150 కోట్లకు తగ్గించారు.

## పెద్దపులి సంచారంపై ఆందోళన వద్దు : దుర్గేష్

శాఖ అధికారితో ఫోన్‌లో మాట్లాడారు. పులి సంచారానికి సంబంధించిన తాజా సమాచారాన్ని అడిగి తెలుసుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. గత కొన్ని రోజులుగా తొర్రేడు, సీతానగరం సమీపంలో పులి సంచరిస్తుందని, దాని ఆనవాళ్లు గుర్తించామని, త్వరలోనే పట్టుకుంటామని అధికారి చెప్పారన్నారు. గతంలో ఇదే ప్రాంతంలో ఒకసారి పులి సంచారం చేసిందని మంత్రి దుర్గేష్ గుర్తుచేశారు. తగిన జాగ్రత్తలు తీసుకొని త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలను అప్రమత్తం చేసేందుకు తక్షణమే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశిం చారు. వెంటనే సంబంధిత ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అటవీ శాఖ పులిని పట్టుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారని ఈ సందర్భంగా పెద్దపులి పట్టుబడేంత వరకు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఒంటరిగా వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లొద్దని, రాత్రి సమయాల్లో పశువుల పాక చుట్టూ ఎక్కువ కాంతినిచ్చే దీపాలు ఏర్పాటు చేసుకోవాలని మంత్రి దుర్గేష్ సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తోందని, ప్రజల రక్షణే తమ ప్రాధాన్యత అని మంత్రి దుర్గేష్ తెలిపారు. త్వరితగతిన పులిని పట్టుకునేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకున్నట్లు మంత్రి దుర్గేష్ ప్రజలకు భరోసానిచ్చారు.

# 12న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి





**విజయవాడ, పతాకం న్యూస్:** నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మికుల హక్కుల కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో విజయవాడ బాలోత్సవ భవనంలో జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్ నర్సింగరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చిన మోడీ ప్రభుత్వానికి అడ్డు అదుపు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఈ విధానాలకు ఫుల్ స్టాఫ్ పెట్టాలంటే కార్మిక వర్గం 4 లేబర్ కొడ్స్ కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేయటం తప్ప మరో మార్గం లేదన్నారు. మేజార్టీ కార్మిక వర్గం వ్యతిరేకించిన, తమ అనుకూల కొంతమంది మేథావులతో కలిసి నీతిఆయోగ్ లో నిర్ణయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్పొరేట్ లకు అనుకూలంగా చట్టాలు తెస్తున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. వ్యవసాయన్ని నష్టపరిచి, కార్పొరేట్లను పెంచాలనేది కేంద్ర నిర్ణయమన్నారు. శ్రమ చేసేవారిని చిన్నచూపు చూడటం బిజెపికే చెల్లిందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు మూలి సాంబశివరావు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వానికి అనుగుణంగా రాష్ట్ర కూటమి ప్రభుత్వం వ్యవహారించటం సిగ్గు చేటన్నారు. పోరాడి సాధించున్నా 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి, 10 గంటల పని చేయాలని జీఓ తేవాటం సిగ్గు చేటన్నారు. గత సిఎంకు పట్టిన గతే చంద్రబాబుకు పట్టిందని హేద్దవ చేశారు. ఏఐసిసిటియు రాష్ట్ర కార్యదర్శి ఆరేపల్లి ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ..... 4 లేబర్ కొడ్స్ వలన సమ్మె చేసే హక్కు, యూనియన్ పెట్టుకునే హక్కు పోతున్నాయన్నారు. ఏఐయుటియుసి రాష్ట్ర అధ్యక్షులు సుధీర్ మాట్లాడుతూ ఉద్యోగ, ఆరోగ్య భద్రత లేకుండా పోయిందన్నారు. ఐ.ఎఫ్.టియు రాష్ట్ర అధ్యక్షులు కె. పోలారి మాట్లాడుతూ.... బ్రిటిష్ కాలంకు ముందే కార్మికుల పోరాట ఫలితంగా వచ్చిన కార్మిక చట్టాలు, హక్కులను బిజెపి ప్రభుత్వం రద్దు చేసి, 4 లేబర్ కొడ్స్ తేవాటం, వాటిని అమలు చేయాలని చూడటాన్ని 12 సమ్మెతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

## సౌర విద్యుత్ అమలుపై వర్క్‌షాప్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో యుటిలిటీ లెడ్ అగ్రిగేషన్ మోడల్ ద్వారా రూఫ్‌టాప్ సౌర విద్యుత్ అమలుపై సామర్థ్యవృద్ధి వర్క్‌షాప్ విశాఖపట్నంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్‌లో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి మాట్లాడుతూ, భారతదేశ వాతావరణ మార్పు కట్టుబాట్లలో భాగంగా కేంద్ర ప్రభుత్వం పిఎం సూర్య ఘర్ : ముఫ్త్ బిజ్లీ యోజన కింద ఒక కోటి గృహాలకు సౌర విద్యుత్ అందించేందుకు కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 94 వేల వినియోగదారులకు 328 మెగావాట్ల సామర్థ్యంతో రూఫ్‌టాప్ సౌర విద్యుత్ వ్యవస్థలు ఏర్పాటు అయ్యాయని, ఎపిఇపిడిసిఎల్ పరిధిలోనే 44,452 కనెక్షన్లకు 142 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను ఏర్పాటు చేసామని పేర్కొన్నారు. సౌర విద్యుత్ వినియోగాన్ని వేగవంతం చేసేందుకు గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో అవగాహన కార్యక్రమాలు, ఇంటింటి ప్రచారాలు, కరపత్రాల పంపిణీ చేపట్టామని చెప్పారు. వినియోగదారులకు అనుకూలంగా అప్లికేషన్ ఫీజు, నెట్ మీటరింగ్ చార్జీల మినహాయింపు, ఒకే చోట అన్ని ప్రక్రియలు పూర్తయ్యే విధానాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. ఇపిసి సంస్థలు పీఎం సూర్య ఘర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసిన అనంతరం సగటున 3-4 రోజుల్లో అనుమతులు మంజూరు చేస్తున్నామని, గరిష్ఠంగా వారం రోజుల్లో ప్రక్రియ పూర్తవుతోందని వివరించారు. ఈ వర్క్‌షాప్‌లో ఎపిఇపిడిసిఎల్ డైరెక్టర్ టివి.సూర్య ప్రకాష్, టి.వనజ, ఎస్.హరిబాబు, చీఫ్ జనరల్ మేనేజర్లు ఎల్.దైవప్రసాద్, బి.అశోక్ కుమార్ పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెలో భోజన పథకం కార్మికులు



**చోడవరం, పతాకం న్యూస్:** పాఠశాలల మధ్యాహ్న భోజన పథకానికి కేంద్ర ప్రభుత్వం నిధులు పెంచాలని, భోజన పథకాన్ని ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించవద్దని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నట్టు పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆమె జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో అధికారులకు సమ్మె నోటీసు అందించారు. అనంతరం వరలక్ష్మి మాట్లాడుతూ, భోజన పథకం కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు సూర్యలక్ష్మి, నాయకులు ఎం.శ్రీదేవి, జానకి, శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ఆరిలోవ, పతాకం న్యూస్:** జివియంసి 13వ వార్డు పరిధి శ్రీకాంత్‌నగర్ లే-అవుట్ పక్కన బాక్స్ కల్వర్టు, గెడ్డ కాంక్రీట్ వాల్, శివాజీనగర్ గెడ్డ కాంక్రిట్ వాల్ నిర్మాణానికి కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ, వార్డు టిడిపి అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావుతో కలిసి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు భూమి పూజ చేశారు. జివియంసి నిధులు రూ.2.80 కోట్లతో ఈ పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్వరమే పనులు ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ శాంతిరాజు, డిఇ చంద్రమౌళి, టిడిపి వార్డు ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి, కూటమి నాయకులు పట్టా నూకరాజు, వడిసెల శ్రీను, గలాల రమణమూర్తి, నీలి పైడిరాజు పాల్గొన్నారు.10వ వార్డులో.. జివిఎంసి 10వ వార్డు పరిధి తోటగరువు, బిఎన్ఆర్ నగర్ కాలనీలను అనుసంధానం చేసే బ్రిడ్జి ఎక్షటన్షన్ నిర్మాణానికి వార్డు కార్పొరేటర్ మద్దిల రామలకీరాజశేఖర్, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావుతో కలిసి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు భూమి పూజ చేశారు. జివిఎంసి నిధులు రూ.14.63 లక్షలతో ఈ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో డిఇ చంద్రమౌళి, ఎఇ వసంత, టిడిపి నాయకులు మద్దిల రాజేష్, గాడు అప్పలనాయుడు, ఒమ్మి అప్పలరాజు, బిఎన్ఆర్ నగర్ కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

### కార్మికలు చట్టాలు అడ్డగోలుగా మార్చేస్తున్న

## బీజేపీకి గుణపాఠం చెప్పాలి

### ఈ నెల 12 జరిగే ధర్నాలో అన్ని వర్గాల కార్మికుల పాల్గొనాలి




**దేవరాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మికులకు అన్యాయం చేసే విధంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ఆశా కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12వ తేదీన జరుగు సమ్మెలో ఆశా కార్యకర్తలు, అంగన్వాడి, మధ్యాహ్న భోజన కార్మికులు, విఓఏలు, బ్యాంకు ఉద్యోగులు, ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ కాంట్రాక్టు ఉద్యోగులు, ముఠా కార్మికులు, టాపి కార్మికులు అందరూ కూడా పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి వి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. దేవరాపల్లి పిహెచ్ సి వద్ద ఆశా, అంగన్వాడీల కార్యకర్తల నిరసనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ ను కేంద్ర బిజెపి ప్రభుత్వం నవంబర్ 21వ తేదీ నుంచి అమలకు పూనుకున్నదని, ఇది కార్మికులను కట్టు బానిసలుగా చేయడమేనని అన్నారు. కార్మికులకు ఉపయోగపడే ఒక్క అంశం కూడా లేదని అన్నారు. పోరాడి సాధించుకున్న 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచటం, పర్మినెంట్ ఉద్యోగాలు లేకుండా ఫిక్స్ డిటర్మ్ ఎంప్లాయిమెంట్ పద్ధతిని అమలు చేయటం వంటి అనేక దుర్మార్గమైన నిర్ణయాలు లేబర్ కోడ్స్ లో ఉన్నాయని అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులు గాని, స్కీం కార్మికుల గాని పర్మనెంట్ చేయకుండా ఏళ్ల తరబడి పని చేయించుకుంటున్న ప్రభుత్వాలు ఈ లేబర్ కోడ్స్ మూలంగా ఉన్న హక్కులను కూడా కోల్పోతారని అన్నారు. మొన్న జరిగిన బడ్జెట్ సమావేశంలో అంగన్వాడి ఐ సి డి సి ప్రాజెక్ట్ లో లబ్ధిదారులకు నుటుకు నోరు శాతం అందే వస్తువులకు 50 శాతం రాయితీ ఇవ్వడం దుర్మార్గమన్నారు. ఐసిడిసి ప్రాజెక్టులకు ఇచ్చేటటువంటి నూరు శాతం బడ్జెట్ ను కేటాయించాలని దేవరపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్వో గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అందుకే దేశంలో కార్మిక వర్గం యావత్తు ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయని ఈ సమ్మెలో కార్మిక వర్గం అంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి వెంకన్న మద్దతు తెలుపుతూ ఫిబ్రవరి 12 సమ్మె జయప్రదం చేయాలన్నారు. సిఐటియు మండల నాయకులు బి. టి. దొర, ఇందిర, జ్యోతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సమ్మె నోటీసును ఆశా కార్యకర్తలు మెడికల్ ఆఫీసర్లకు అందజేశారు.

## 8న ఉక్కు నిర్వాసితులతో బహిరంగసభ



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** గాజువాకలోని లంక గ్రౌండ్‌లో ఉక్కు నిర్వాసితులతో ఈ నెల 8వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు భారీ బహిరంగ సభ నిర్వహించనున్నామని ఉక్కు నిర్వాసితుల ముఖ్య సలహాదారులు వై.మహదేవ్ తెలిపారు. ఉక్కు నిర్వాసితుల ఐక్య సంఘం, నిర్వాసితుల కాంట్రాక్టు లేబర్ యూనియన్ రూపొందించిన బహిరంగ సభ పోస్టర్లను పౌర గ్రంథాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, సభకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి గోపాలగౌడ్, మాజీ డిజిపి పూర్ణచంద్రరావు, మాజీ ఎంపీ వడ్డే శోభనాదీశ్వరరావు, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి శ్రీనివాస్, ఎమ్మెల్సీ రఘురాజు, లీడర్ సంపాదకులు వివి.రమణమూర్తి తదితరులు పాల్గొని ప్రసంగించనున్నారని వెల్లడించారు. నిర్వాసితులు అనుభవిస్తున్న దీనస్థితి తెలియజేయడానికి ఈ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. విశాఖ ఉక్కు నిర్వాసితుల సంఘం నాయకులు పితాని భాస్కరరావు మాట్లాడుతూ, ఈ బహిరంగ సభలో నిర్వాసితులు తమ కుటుంబాలతో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఉక్కు నిర్వాసితుల ఐక్య సంఘం వ్యవస్థాపక సభ్యులు ఉమ్మడి అప్పారావు మాట్లాడుతూ, ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని అధికారంలోకి వచ్చి కార్పొరేట్ల కోసం పనిచేస్తూ కూటమి నేతలు వ్యాపారాలు చేసుకుంటున్నారని విమర్శించారు. భారీ బహిరంగ సభ ద్వారా స్పందించకపోతే ఎమ్మెల్యే, ఎంపీ కార్యాలయాల ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. తక్షణమే ప్రధాని, ముఖ్యమంత్రి స్పందించి నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంజీవ్, జ్యోతిరెడ్డి, రామకృష్ణ, అంగదేవుడు, మల్లా రవి, టి.తులసి, జగన్, బాలు, సాంబ, ముసలయ్య పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రాణ భద్రత




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** రహదారి ప్రమాదాలను తగ్గించాలంటే ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే రహదారి భద్రతపై అవగాహన పెంపొందించడం అవసరమని చెప్పారు. ఆనందపురం జంక్షన్ వద్ద ఒఎస్‌జి ఫౌండేషన్, ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్, సీటుబెల్టు వినియోగం, త్రిబుల్ రైడింగ్ నివారణ, మొబైల్ ఉపయోగిస్తూ వాహనం నడపకూడదని, ట్రాఫిక్ సిగల్ నిబంధనలు పాటించాలని, మితిమీరిన వేగాన్ని నియంత్రించాలని వాహనదారులకు సూచించారు. లా అండ్ ఆర్డర్ ఎస్ఐ పందిరి శివ మాట్లాడుతూ, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని చెప్పారు. కార్యక్రమంలో ఒఎస్‌జి ఫౌండర్ దళాయి శివ, ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల వ్యవస్థాపక అధ్యక్షులు జంగం జోషి, చల్ల రామిరెడ్డి, మమ్ముల తిరుపతిరావు, కోన ప్రకాష్, గెద్ద చిరంజీవి, కె.నారాయణరావు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

## నైపుణ్యాలు పెంచుకోవాలి




**భీమిలి, పతాకం న్యూస్:** ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువుతో పాటు డిజిటల్, కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెంచుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.సురేఖ విద్యార్థులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న పిఎం ఉష సాఫ్ట్ కాంపొనెంట్లో భాగంగా ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్తంగా ఎమ్మెస్ ఎక్సల్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్‌పై సర్టిఫికెట్ కోర్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సురేఖ మాట్లాడుతూ, సమర్థతతో కూడిన కమ్యూనికేషన్ నైపుణ్యాలు అవసరమని నొక్కి చెప్పారు. వృత్తి పరంగా మెరుగుపరుచుకోవడానికి కూడా ఈ తరహా నైపుణ్యాలు అవసరమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇమ్రాన్ సంస్థ జిల్లా మేనేజర్ ఎక్సలర్, ఐక్యూ ఎసి కో-ఆర్డినేటర్ బి.ప్రసాదరావు, ఉమెన్ ఎంపవర్‌మెంట్ విభాగం కో-ఆర్డినేటర్ డి.ప్రవీణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విషయ నిపుణులుగా ఎస్.సప్తగిరిరెడ్డి, కెవిఎస్.కృష్ణ వ్యవహరించారు.

## మన్యంపై తగ్గని చలి




**పాడేరు, పతాకం న్యూస్:** మన్యంలో ఉదయం పొగమంచు దట్టంగా కమ్మేసింది. పాడేరులో తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకు ఎదుట వ్యక్తులు కనిపించని విధంగా మంచు దట్టంగా కురిసింది. తాజా వాతావరణం పర్యాటకులకు కనువిందు చేసేలా ఆహ్లాదకరంగా ఉంది. అయితే మూడు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుముఖం పడుతున్నప్పటికీ చలి తీవ్రత మాత్రం తగ్గడం లేదు. దీంతో ఉన్ని దుస్తులు ధరించి చలి నుంచి ఉపశమనం పొందుతున్నారు. ప్రస్తుతం పొగమంచు దట్టంగా కురుస్తున్న నేపథ్యంలో వాహనదారులు ఉదయం వేళల్లో అప్రమత్తంగా వాహనాలను నడపాలని భారత వాతావరణ సంస్థ సూచిస్తున్నది. మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. అరకులోయలో 13.0, ముంచంగిపుట్టులో 13.3, జి.మాడుగులలో 13.6, పెదబయలులో 13.8, హుకుంపేటలో 14.1, చింతపల్లిలో 14.9, అనంతగిరిలో 15.8, కొయ్యూరులో 18.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## తొమ్మిదో తరగతి విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు

**విశాఖపట్నం పతాకం న్యూస్:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న తొమ్మిదో తరగతి విద్యార్థులను ముందుగానే పదో తరగతి కోసం సన్నద్ధం చేసే దిశగా విద్యా శాఖ అడుగులు వేస్తోంది. ఇందుకోసం ఈ ఏడాది ముందుగానే వార్షిక పరీక్షలు (ఎస్ఏ-2) నిర్వహించనున్నది. ఆ తరువాత బ్రిడ్జి కోర్సు పేరిట పదో తరగతి సిలబస్ బోధించనున్నారు. వేసవి సెలవులు ప్రారంభమయ్యే ఏప్రిల్ 23వ తేదీకల్లా విద్యార్థులకు అన్ని సబ్జెక్టులపై అవగాహన కల్పించడం, ఆంగ్లం, గణితం, సైన్స్‌లో కొంతమేర సిలబస్ పూర్తిచేయడం...లక్ష్యంగా ప్రణాళిక రూపొందించింది. ఏటా జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం తరువాత చాప్టర్ల వారీగా పాఠ్యాంశాల బోధన చేసేవారు. అయితే ప్రైవేటు విద్యా సంస్థలు పదో తరగతి సిలబస్ బోధనలో ముందుంటాయి. ఎనిమిదో తరగతి విద్యార్థులు తొమ్మిదో తరగతిలో ప్రవేశించిన మూడు నెలల తరువాత టెన్త్ సిలబస్ బోధిస్తుంటాయి. తొమ్మిదో తరగతి పూర్తయి...పదో తరగతికి వచ్చేసరికి టెన్త్ క్లాస్ సిలబస్ పూర్తిచేసేస్తాయి. ఆ తరువాత పదేపదే రివిజన్ చేస్తూ వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేస్తాయి. ఈ కారణంగానే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కంటే ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ముందంజలో ఉంటున్నారని పాఠశాల విద్యా శాఖ గుర్తించింది. ఈ విధానం ప్రభుత్వ పాఠశాలల్లో కూడా అమలు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఏప్రిల్‌లో జరగాల్సిన తొమ్మిదో తరగతి వార్షిక పరీక్షలు ఈసారి మార్చి 2 నుంచి 12వ తేదీ వరకూ జరుపుతారు. వచ్చే నెల 13 నుంచి ఏప్రిల్ 23 వరకు టెన్త్ సిలబస్‌పై సందేహాలు, పరీక్షల విధానంపై అవగాహన, ప్రధాన సబ్జెక్టులలో కొన్ని పాఠ్యాంశాల బోధన చేస్తారు.

## నగర సుందరీకరణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలపై విమర్శలు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** నగరంలో ఈనెల 15 నుంచి ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) జరగనున్న నేపథ్యంలో జీవీఎంసీ చేపడుతున్న నగర సుందరీకరణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఐఎఫ్ఆర్‌కు హాజరయ్యే అతిథులు ప్రయాణించే మార్గాల్లో కొత్తగా తారురోడ్లు, డివైడర్లు, ఫుట్‌పాత్‌లకు మరమ్మతులు, పెయింటింగ్ పనులకు రూ.15 కోట్లు వెచ్చిస్తున్నారు. ఈ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా చేస్తున్నా అధికారులు ప్రశ్నించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. భారత నేవీ శక్తిసామర్థ్యాలను ప్రదర్శించడంతోపాటు ప్రపంచ దేశాలతో పరస్పర సహకారమే లక్ష్యంగా ఐఎఫ్ఆర్‌ను నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది ఈ కార్యక్రమాన్ని విశాఖలో నిర్వహించాలని భారత నేవీ, రక్షణ శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ మేరకు బీచ్‌రోడ్డులో ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ రూ.15 కోట్ల వ్యయంతో రోడ్ల నిర్మాణం, సుందరీకరణ పనులు చేపట్టింది. అయితే ఇంజనీరింగ్ విభాగంలోని అధికారులు, కొందరు కాంట్రాక్టర్లు మిలాఖత్ అయి పనుల్లో నాణ్యతకు తిలోదకాలిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫుట్‌పాత్‌లు, సెంటర్ మీడియన్లు, డివైడర్ల మరమ్మతులు పూర్తిచేయడం, రంగులు వేయడానికి జీవీఎంసీ అధికారులు టెండర్లు పిలిచారు. నిబంధనల ప్రకారం రంగులు వేసే ముందు ఫుట్‌పాత్‌లు, సెంటర్‌మీడియన్లు, డివైడర్లను నీటితో శుభ్రం చేసి దుమ్ము, ధూళిని పోగొట్టాలి. తర్వాత వాటిపై ప్రైమర్ వేసి గతంలో ఉన్న రంగులను చెరిపేయాలి. ఆ తర్వాత నిపుణులైన పెయింటర్లతో అధికారులు సూచించిన రంగులను వేయాలి. కానీ నగరంలో జరుగుతున్న పెయింటింగ్ పనుల్లో ఆ పరిస్థితి కనిపించడంలేదు. ఇప్పటివరకు దుమ్ము, ధూళితో నిండిన ఫుట్‌పాత్ కెర్బ్‌లు, డివైడర్లు, సెంటర్ మీడియన్‌లను కనీసం నీటితో కడగకుండానే అధికారులు సూచించిన రంగులను వేసేస్తున్నారు. ఫుట్‌పాత్ కెర్బ్‌లకు ఉన్న మట్టిని తొలగించకుండా బ్రష్‌తో రంగులు వేసుకుంటూ వెళ్లిపోతున్నారు. దీనివల్ల ప్రస్తుతానికి కాంతివంతంగానే కనిపించినా, చిన్న వర్షం కురిసినా డివైడర్లు, ఫుట్‌పాత్‌లపై పేరుకుపోయిన మట్టి కరిగిపోతుంది. దీనివల్ల మట్టిపైన వేసిన పెయింటింగ్ కొట్టుకుపోయి డివైడర్లు, సెంటర్ మీడియన్లు, ఫుట్‌పాత్ అసహ్యంగా కనిపిస్తాయి. పనులు జరుగుతున్నప్పుడు క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించి, నాణ్యతతోపాటు ఇతర ప్రమాణాలను పాటిస్తున్నారా? లేదా? పరిశీలించాలి. కానీ అవేవి చేయకపోవడంతో కాంట్రాక్టర్లు తమకు నచ్చిన రీతిలో రోజువారీ అడ్డాకూలీలను తీసుకువచ్చి మొక్కుబడిగా రంగులు వేయించేస్తున్నారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించండి



**నరసన్నపేట, పతాకం న్యూస్:** పట్టణంలోని వజ్రంపేట, నక్కవీధి, దేశవానిపేట, శివనగర్‌కాలనీ తదితర వీధుల్లో కొన్నాళ్లుగా తాగునీరు సరిగా కుళాయిల ద్వారా రాక ఇబ్బంది పడుతున్నామని వజ్రంపేటకు చెందిన మహిళలు వాపోయారు. గతంలో మాదిరిగా రోజుకు రెండుపూటలు కుళాయిల ద్వారా తాగునీరు పంపిణీ చేయాలని కోరారు. ఈ మేరకు ఈవో పి.ద్రాక్షాయిణి వద్ద తాగునీరు కొనుగోలు చేస్తున్నామని, వాడుకల కోసం ఇబ్బంది పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు. శివానగర్‌కాలనీ, దేశవానిపేట, వజ్రంపేట, పసారువీధి తదితర కాలనీలకు పూర్తిస్థాయిలో తాగు నీరందించేందుకు రక్షిత మంచినీటి పథకం పనులు జరుగుతున్నాయని, అంతవరకు ట్యాంకర్ల ద్వారా పంపిణీ చేస్తామని ఈవో చెప్పారు. కార్యక్రమంలో నక్కవీధి, వజ్రంపేట వీధుల మహిళలు పాల్గొన్నారు.

## వాట్సప్ గోప్యతా పాలసీపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** వాట్సప్ గోప్యతా పాలసీ 2021లోని "స్వీకరించండి లేదా వదిలివేయండి" విధానంపై సుప్రీంకోర్టు మంగళవారం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఫిబ్రవరి 9న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్య బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం.పంచోలిలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఈ పిటిషన్లలో ఎలక్ట్రానిక్స్ మరియు సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖను పార్టీగా చేర్చాలని ఆదేశించింది. వినియోగదారులు రహస్య సమాచారాన్ని పంచుకోవాలని (డేటా షేరింగ్) ఒత్తిడి చేస్తోందని సిజెఐ సూర్యకాంత్ మౌఖికంగా వ్యాఖ్యానించారు. వినియోగదారుల గోప్యతతో మీరు ఎలా ఆడుకుంటారు? మీ నిలిపివేత నిబంధన భాష సంక్లిష్టంగా ఉంది. తమిళనాడు గ్రామీణ ప్రాంతానికి చెందిన వ్యక్తి దానికి ఎలా అర్థం చేసుకుంటారని మీరు ఆశించగలరు. సమాచారాన్ని పంచుకునే ప్రశ్నే లేదు అని సిజెఐ పేర్కొన్నారు. డేటా షేరింగ్ పేరుతో దేశ ప్రజల గోప్యతా హక్కుతో ఆటలాడుకోలేరని హెచ్చరించారు. ఆమోదయోగ్యమైన మార్గంలో గోప్యతా సమాచారాన్ని దొంగిలిస్తున్నారని, అయితే తాము అనుమతించమని, ఇందుకు కట్టుబడాలని లేకుంటా ఉత్తర్వులు జారీ చేస్తామని సిజెఐ పేర్కొన్నారు.

# మాజీ మంత్రి కాకాణికి పోలీసుల నోటీసులు



**నెల్లూరు, పతాకం న్యూస్::** మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డి మురికి వ్యాఖ్యలపై టీడీపీ నాయకులు నెల్లూరు జిల్లా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన పోలీసులు నెల్లూరులోని కాకాణి ఇంటికి వెళ్లి నోటీసులు అందజేశారు. ఈ రోజు విచారణకు రావాలని నోటీసులో పేర్కొన్నారు. అయితే ఎందుకోసం రమ్మంటున్నారో చెప్తేనే వస్తానని పోలీసులకు స్పష్టం చేశారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి మూడు రోజుల క్రితం మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే సోమిరెడ్డిపై పరుష పదజాలంతో మాట్లాడారు. చంద్రబాబు, సోమిరెడ్డి తల్లిదండ్రులపై మురికి వ్యాఖ్యలు చేశారు. దీనిపై టీడీపీ నేతలు స్పందించారు. కొన్నాళ్లుగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా, రెచ్చగొట్టే ధోరణితో కాకాణి వ్యాఖ్యలు చేస్తున్నారని, కండిషన్ బెయిల్?పై ఉండి కూడా పోలీసు, చట్టాలను లెక్కచేయడం లేదని టీడీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ అధికారంలోకి వస్తామంటూ బహిరంగంగా అధికారులను బెదిరిస్తున్నారని పోలీసులకు టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. టీడీపీ నేతల ఫిర్యాదులతో నెల్లూరు రూరల్, పొదలకూరు, మనుబోలులో కేసులు నమోదు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్సీపీ నేతలు ఇదే ధోరణితో వ్యవహరిస్తున్నారని టీడీపీ నేతలంటున్నారు. గుంటూరు జిల్లాలో అంబటి రాంబాబు, విజయవాడ జోగి రమేష్? అసభ్య పదజాలంతో చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌లను విమర్శిస్తున్నారని మండిపడ్డారు. "ఈ సాయంత్రమే విచారణకు రావాలని నోటీసులు ఇచ్చారు. నేను సోమిరెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై విచారణకు రమ్మన్నారు. ఏ అంశంలో నేను ఆరోపణలు చేశానో స్పష్టంగా చెప్పాలని అడిగాను. సోమిరెడ్డిపై నేను చాలా ఆరోపణలు చేశాను. ఏ అంశంలో విచారణకు రమ్మన్నారు చెబితే వాటికి సంబంధించిన ఆధారాలు తీసుకువెళతా. ఏ అంశం ఉందన్నది స్పష్టత లేదు. విచారణకు రావడానికి నేను సిద్ధమే. కేసుకు సంబంధించిన వివరాలు ఇస్తే విచారణకు హాజరు అవుతా. ఇదే విషయాన్ని నోటీసుపై రాసి ఇచ్చాను. దరిద్రుడు అనే వ్యాఖ్య పెద్ద తిట్టు కాదు. పోలీస్ స్టేషన్లో కేసు పెట్టే అంత వ్యాఖ్య కాదని నేను అనుకుంటున్నా. వివరాలు చెప్తే నేను ఎక్కడికైనా వస్తాను, నోటీసుపైన దేనిపై కేసు నమోదు చేశారు, దేనికి స్టేషన్‌కు హాజరు కావాలంటున్నారు చెప్తే నేను రావడానికి సిద్ధం అని కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు.

## నేడు జీవీఎంసీ బడ్జెట్ సమావేశం




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) 2026-27 బడ్జెట్ సమావేశం బుధవారం నిర్వహించనున్నట్టు కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో కేవలం బడ్జెట్‌పై మాత్రమే చర్చ ఉంటుందన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.4,047.12 కోట్ల ముసాయిదా బడ్జెట్‌ను జీవీఎంసీ కమిషనర్‌తోపాటు స్టాండింగ్ కమిటీ ఇప్పటికే ఆమోదించిన విషయం తెలిసిందే. జీవీఎంసీకి ఆస్తి పన్ను ద్వారా రూ.550 కోట్లు, ఖాళీ స్థలాల పన్ను ద్వారా రూ.85 కోట్లు, స్థిరాస్తుల బదలాయింపు ద్వారా రూ.200 కోట్లు, మార్కెట్‌లు, షాపింగ్ కాంప్లెక్స్‌ల వేలం ద్వారా రూ.4.8 కోట్లు, క్రీడా మైదానాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, ఫంక్షన్ హాల్స్ అద్దెల ద్వారా రూ.65 లక్షలు మొత్తం సాధారణ పరిపాలన ద్వారా రూ.123.26 కోట్లు ఆదాయం సమకూరుతుందని ముసాయిదాలో పొందుపరిచారు. అలాగే ఇంజనీరింగ్ నుంచి రూ.264.56 కోట్లు, ప్రాజెక్టుల కోసం రూ.550 కోట్లు, టౌన్‌ప్లానింగ్ ద్వారా రూ.543 కోట్లు, పార్కులు, లీజర్స్ ద్వారా రూ.30 కోట్లు, అమృత్ ద్వారా రూ.162 కోట్లు, డిపాజిట్లు, అడ్వాన్సుల ద్వారా రూ.382.79 కోట్లు మొత్తం మరో 3,814.41 కోట్లు ఆదాయం సమకూరుతుందని అంచనా వేశారు. ఇదిలావుండగా రోడ్లు, భవనాలు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణం కోసం ఇంజనీరింగ్ విభాగం ద్వారా రూ.1018.18 కోట్లు, ప్రజారోగ్య విభాగానికి రూ.455.94 కోట్లు ఖర్చు చేయాలని అంచనా వేశారు. సాధారణ పరిపాలనా విభాగాలకు రూ.375.82 కోట్లు, నీటి సరఫరాకు రూ.260.08 కోట్లు, విద్యుత్ దీపాలకు రూ.12.91 కోట్లు, ప్రాజెక్టులకు రూ.67.35 కోట్లు, టౌన్‌ప్లానింగ్‌కు రూ.23.93 కోట్లు, యూసీడీకి రూ.16.43 కోట్లు, విద్యకు రూ.2.25 కోట్లు, పార్కులు, లీజర్స్, సెమిట్రీలకు రూ.36.14 కోట్లు మొత్తం రూ.4,047.12 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని ముసాయిదాలో పొందుపరిచారు. ఈ ముసాయిదాను ఇప్పటికే కమిషనర్, స్టాండింగ్ కమిటీ ఆమోదించడంతో కౌన్సిల్ ఆమోదానికి వచ్చింది. దీనిపై బుధవారం మేయర్ అధ్యక్షతన జరిగే సమావేశంలో చర్చించి సభ్యుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఆమోదించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తారు.

## లోక్‌సభలో తీవ్ర ఉద్రిక్తత... 8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సభలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి, నిరసన పేరుతో కాగితాలను చింపి స్పీకర్ ఛైర్ వైపు విసిరారన్న కారణంతో 8 మంది కాంగ్రెస్ ఎంపీలను లోక్‌సభ నుంచి సస్పెండ్ చేశారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు ఈ సస్పెన్షన్ అమల్లో ఉంటుందని స్పీకర్ ప్యానెల్ ఆఫ్ ఛైర్ పర్సన్స్ లో ఒకరైన దిలీప్ సైకియా ప్రకటించారు. సస్పెన్షన్ వేటు పడిన వారిలో అమరీందర్ సింగ్ రాజా వారింగ్, మాణికం ఠాగూర్, గురుజీత్ సింగ్ ఆజులా, హిబి ఈడెన్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రశాంత్ యాదవరావు పడోలే, ఎస్.వెంకటేశన్, డీన్ కురియకోస్ ఉన్నారు. "ప్రతిపక్షాలకు తమ గళం వినిపించే హక్కు ఉంది, కానీ నిరసన పేరుతో సభను పూర్తిగా స్తంభింపజేయడం, ప్రొసీడింగ్స్ జరగకుండా అడ్డుకోవడం పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధం" అని దిలీప్ సైకియా వ్యాఖ్యానించారు. అంతకుముందు, సరిహద్దుల్లో చైనా ఆక్రమణల అంశంపై చర్చించాలంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పట్టుబట్టారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన పుస్తకానికి సంబంధించిన ఓ మ్యాగజైన్ కథనాన్ని రాహుల్ ప్రస్తావించారు. అయితే, ధృవీకరించని వార్తా కథనాలను సభలో చదవకూడదని సైకియా అభ్యంతరం తెలపడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా రాహుల్ స్పందిస్తూ.. "మాట్లాడటానికి నాకు ఎవరి అనుమతి అవసరం లేదు. నేను ప్రతిపక్ష నాయకుడిని.. నాకు పర్మిషన్ అనే పదం వాడటం సరికాదు" అని మండిపడ్డారు. తూర్పు లడఖ్‌లో ఘర్షణల వల్ల భారత సైనికులు ప్రాణాలు కోల్పోయారని, దీనిపై ప్రధాని స్పందన ఏమిటని రాహుల్ ప్రశ్నించారు. ఈ సమయంలోనే అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం జరిగింది. విపక్ష సభ్యులు వెల్ లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. గందరగోళం మధ్యే సస్పెన్షన్ తీర్మానాన్ని ఆమోదించిన అనంతరం సభను మంగళవారానికి వాయిదా వేశారు. టీడీపీ ఎంపీ జి.ఎం. హరీశ్ బాలయోగి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మాట్లాడేందుకు ప్రయత్నించినప్పటికీ, సభలో నిరసనల హోరు తగ్గకపోవడంతో ప్రసంగం కొనసాగలేదు.

## ఆశాజనకంగా రొయ్యల ధర



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** మొన్నటి వరకు బిక్కచూపులు చూసిన రొయ్యల ధర ప్రస్తుతం ఆశాజనకంగా ఉంది. దీంతో రొయ్యలు సాగుచేస్తున్న రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. కొన్నాళ్ల కిందట వరుస తుఫాన్‌లు.. ఓ వైపు అనుకూలించని వాతావరణ పరిస్థితులు.. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆంక్షలతో ఎగుమతిపై సుంకాల బెడద కారణంగా ఆక్వా రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించి యూరోపియన్ మార్కెట్‌కు మన దేశ రొయ్యలు ఎగుమతి అయ్యేలా చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి ఒప్పందం కూడా కుదరడంతో.. యూరోపియన్ మార్కెట్‌కు రొయ్యల ఎగుమతి ప్రారంభమైంది. ఈ క్రమంలో రొయ్యల ధర పెరగడంతో ఆక్వా రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 11 తీరప్రాంత మండలాల్లో 3,300 హెక్టార్లలో రొయ్యల చెరువులు సాగు చేస్తున్నారు. ప్రధానంగా జిల్లాలో సంతబొమ్మాళి, సోంపేట, ఇచ్ఛాపురం, వజ్రపుకొత్తూరు, పోలాకి, రణస్థలం, ఎచ్చెర్ల, గార తదితర మండలాల్లో రైతులు ఆక్వాసాగుపై ఆసక్తి చూపారు. ప్రధానంగా విదేశీ ఎగుమతికి అవకాశం ఉండే రొయ్యలను సాగు చేస్తున్నారు. గత మూడు నాలుగు నెలల కిందట వరుస తుఫాన్లు, భారీ వర్షాలతో ఆక్వా రంగంపై ప్రభావం పడి రైతులకు నష్టం వాటిల్లింది. వాతావరణ పరిస్థితులు అనుకూలించక రొయ్య ఎదుగుదల సక్రమంగా లేక ధర తగ్గింది. అలాగే జిల్లాలో సాగుచేసే రొయ్యలకు దేశీయంగా కూడా మార్కెట్ ఉంది. గతంలో రొయ్యలు అమెరికాకు ఎగుమతి అయ్యేవి. అక్కడ కేవలం 20,30,40 కౌంట్లుకు మాత్రమే మంచి గిరాకీ ఉండేవి. కానీ అమెరికాలో ట్రంప్ సుంకాల బెడద కారణంగా రొయ్యల సాగు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కనీసం పెట్టుబడి కూడా రాక ఆక్వా రైతులు ఇబ్బందులు పడ్డారు.

## అలాంటి వారికి పోలీసు ట్రీట్‌మెంట్ ఖాయం.. మంత్రి అనిత వార్నింగ్




**అమరావతి, పతాకం న్యూస్:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనకు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనకు ఎలాంటి పొంతన లేదని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. మంగళవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గత రెండు రోజుల్లో జరిగిన పరిణామాలను ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం పార్టీ కార్యకర్తల కోపాన్ని అదుపు తప్పకుండా సంయమనం పాటించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. నాయకులకు వాస్తవాలను వివరించి, రాష్ట్రాభివృద్ధి లక్ష్యాలను గుర్తు చేసి.. వైసీపీ ఉచ్చులో పడకుండా నియంత్రించామన్నారు హోంమంత్రి. టీడీపీ కార్యకర్తలను గత 20 నెలలుగా పూర్తి అదుపులో పెట్టాం కాబట్టే రాష్ట్రంలో మంచి వాతావరణం నెలకొందని తెలిపారు. కార్యకర్తల కడుపు మంటను అర్థం చేసుకున్నప్పటికీ, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడకుండా సరైన సమయంలో హితబోధ చేసిన నాయకుడు చంద్రబాబు అని అనిత కొనియాడారు. గతంలో 'బోసు డీకే' అనే పదానికి బూతు సృష్టించి టీడీపీ కార్యాలయంపై జగన్ దాడి చేయించారని గుర్తుచేశారు. ఆ పదానికే తన కార్యకర్తలకు బీపీలు వచ్చాయని జగన్ సమర్థించుకున్నారని మంత్రి తెలిపారు. వైసీపీ నేతలు అసభ్య పదజాలంతో దూషిస్తుంటే కూడా తమ అధినేత ఇప్పటికీ సంయమనం పాటించమని సూచిస్తున్నారని హోంమంత్రి అన్నారు. హింసను, విధ్వంసాన్ని ప్రోత్సహించి ప్రజలను జగన్ భయభ్రాంతులకు గురిచేశారని విమర్శించారు. బూతులు, హింసాత్మక చర్యలతో వైసీపీ నేతలను ప్రోత్సహించారే తప్ప ఏనాడైనా తప్పుని చెప్పారా అంటూ జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఒక క్రిమినల్ ఆలోచనా విధానాలను, విజనరీ ఆలోచనలను అర్థం చేసుకున్నారని అన్నారు. క్రిమినల్ ఆలోచనలతో రాష్ట్రంలో అలజడి సృష్టించేందుకు వైసీపీ యత్నిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తప్పు చేయాలనే ఆలోచన రావాలంటేనే భయపడేలా రాజకీయ రౌడీలకు పోలీసు ట్రీట్మెంట్ ఇస్తామని మంత్రి అనిత వార్నింగ్ ఇచ్చారు.

## ఒఆర్ఆర్ భూములకు మార్కెట్ ధర చెల్లించండి



**విజయవాడ, పతాకం న్యూస్:** అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు కింద ఎన్‌టిఆర్ జిల్లాలో భూములు కోల్పోయే రైతులకు బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, రోడ్డు వెడల్పు తగ్గించాలని ఎపి రైతు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశకు వినతిపత్రం అందజేశారు. ఒఆర్ఆర్ బాధిత రైతులు విజయవాడ కలెక్టరేట్లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ కార్యాలయం వద్ద కొద్దిసేపు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి పగడాల వీరాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కల్యాణ్, బాధిత రైతులు మాట్లాడుతూ ఒఆర్ఆర్ కోసం కంచికచర్ల, వీరులపాడు, జి.కొండూరు, మైలవరం మండలాల పరిధిలో భూములకు నోటిఫికేషన్ జారీ చేశారని తెలిపారు. బాధిత రైతులంతా సన్నకారు, చిన్నకారు రైతులని, తరతరాలుగా వస్తున్న భూములపై ఆధారపడి మాత్రమే జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. తొలుత ప్రభుత్వం ఒఆర్ఆర్‌ను 140 మీటర్ల వెడల్పుతో ప్రతిపాదించిందని, కానీ గెజిట్ నోటిఫికేషన్లో 250 మీటర్లకు పెంచారని వివరించారు. బఫర్ జోన్ పరిధిలో 500 మీటర్లు ఉంటుందని ప్రచారంలో ఉందన్నారు. అవసరానికి మించిపోయి భూమి సేకరణ జరుగుతోందన్నారు. రోడ్డు వెడల్పును 70 మీటర్లకు కుదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాకు చెందిన బాధిత రైతులు నన్నపనేని భాస్కరరావు, మల్లెల సుబ్బారావు, బుడ్డి వీర ప్రసాద్, గంగిరెడ్డి రంగారావు, కె.ఎస్.ఎస్.ప్రసాద్‌తోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు. కలెక్టర్ స్పందిస్తూ బాధిత రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## పోస్టల్ కార్యాలయం వద్ద ఖాతాదారుల ఆందోళన



**ఇచ్ఛాపురం, పతాకం న్యూస్:** ఇచ్ఛాపురం పోస్టాఫీసు వద్ద ఖాతాదారులు ఆందోళనకు దిగారు. తాము దాచుకున్న డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ఏడాది జూలైలో పోస్టల్ శాఖలో భారీ అవినీతి వెలుగుచూసింది. 33మంది ఖాతాదారులకు సంబంధించిన కిసాన్ వికాస్‌పత్రాల బాండ్లు నగదు రూ.2.86 కోట్లు గల్లంతయ్యాయి. సైబర్ నేరస్థులతో కలిసి కొంతమంది సిబ్బంది చేతివాటం ప్రదర్శించడం చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై అప్పట్లో పోస్టల్ ఉన్నతాధికారులు దర్యాప్తు చేసి ఐదుగురు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. మరో 9 మందిని అనుమానితులుగా చేర్చారు. అయితే దాదాపు ఏడు నెలలు గడిచినా ఈ కేసుకు సంబంధించి దర్యాప్తులో ఏం జరిగిందన్నది తేలలేదు. అప్పట్లో బాధితులు ఆందోళన చేయగా.. ప్రతి బాధిత ఖాతాదారుడికి పరిహారంతో సహా డబ్బులు చెల్లిస్తామని పోస్టల్ ఉన్నతాధికారులు హామీ ఇచ్చారు. కానీ ఇప్పుడు 33 మందిలో 20 మందినే పిలిచి చెక్కులు ఇచ్చారు. అప్పట్లో చెప్పినట్టుగా కాకుండా నగదులో కోత విధించారు. దీంతో వారు చెక్కులను తీసుకునేందుకు ఒప్పుకోలేదు. బాధిత ఖాతాదారులంతా కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. సిబ్బంది తాళాలు తీయకుండా అడ్డుకున్నారు. తాము దాచుకున్న డబ్బులు ఇంకెప్పుడు ఇస్తారంటూ సిబ్బందిని నిలదీశారు. దీంతో గందరగోళం పరిస్థితి నెలకొనగా పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఖాతాదారులను స్టేషన్‌కు తీసుకెళ్లారు. వారితో సీఐ చిన్నంనాయుడు చర్చలు జరిపారు. పోస్టల్ ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రతిఒక్క బాధితుడికి పూర్తిస్థాయిలో నగదు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో బాధితులు శాంతించారు. బాధితులకు అండగా ఉంటానని జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ దాసరి రాజు భరోసా ఇచ్చారు.

## చదువుపై దృష్టి సారించాలి: కలెక్టర్



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:**పదో తరగతి పరీక్షలు దగ్గరవుతుండడంతో విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కో రారు. లక్ష్యం చిన్నదైనా గురి పెద్దదిగా ఉండాలని తెలిపారు. టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్రస్థాయి ఎడ్యుకేషనల్ ఎపిపని మెరిట్‌టెస్ట్- 2026లో ప్రథమ ర్యాంక్ సాధించిన సీతాపురం జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థి సకలాభక్తుల భరత్‌ను అభినందించారు. ఈ సందర్భంగా గణితం, సైన్స్, జనరల్ నాలెడ్జ్ విభాగంలో ప్రభుత్వపాఠశాలల్లో చదువుతున్న ఏడు, పదోతరగతి విద్యా ర్థులను ప్రోత్సహించేందుకు ఎడ్యుకేషనల్ ఎపిపని స్వచ్ఛందసంస్థ ఆన్‌లైన్‌మెరిట్ పరీక్ష నిర్వహించిందని, మొదటి ర్యాంకు సాధించిన భరత్‌కు రూ.30వేల ప్రోత్సా హం, కప్ అందించారని హెచ్‌ఎం తమ్మినాన పద్మావతి, గైడ్‌గా వ్యవహరించిన బి.చిన్నారావులు తెలిపారు. వీరితో పాటు ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి ఉన్నారు. టెక్కలిలోని జిల్లా కేంద్రాసుపత్రిలో వైద్యులు, సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కేంద్రాసుపత్రికి వచ్చిన కేసులకు సంబంధించి సేవలు అందిం చకుండా సిబ్బంది ఎక్కువగా రిఫర్ చేస్తున్నారని బీజేపీ మండలాధ్యక్షుడు జర్జాన రామ్‌జీ, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, రోగులకు అవసరమైన ట్రీట్ మెంట్ జరగడం లేదని కోటబొమ్మాళి మండలంలోని జర్జంగికి చెందిన జీరు యర్రయ్య, జిల్లా కేంద్రాసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంపై నందిగాం మండలంలోని కొత్తగ్రహారం గ్రామానికి చెందిన మొగిలిపేట జగ్గారావు అర్జీని అందజేశారు.

# అప్పులు ఎక్కువ.. సంక్షేమం తక్కువ..!

- **కాగితాలకే పరిమితమైన పెంపు**
- **ఏడాది ముగిసే సరికి అంచనాలు తలకిందులు**
- **ఆయా రంగాలపై ఆశించినంతగా జరగని వ్యయం**
- **ప్రజలకు చేకూరని నిజమైన లబ్ది**
- **బడ్జెట్‌లో వెల్ఫేర్ ఖర్చులపై ప్రశ్నలు**



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పదేండ్లుగా దేశాన్ని పాలిస్తున్నప్పటికీ... పాలన కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. 'వికసిత్ భారత్', 'అమృత్‌కాల్' వంటి నినాదాలు వినిపిస్తున్నాయి గానీ.. ఆ నినాదాల వెనుక ప్రజల జీవితాల్లో మాత్రం మార్పు కనిపించడం లేదు. ప్రతీ బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు భారీ కేటాయింపులు ప్రకటిస్తున్న కేంద్రం.. ఏడాది ముగిసేసరికి అవే పథకాల్లో ఖర్చులు తగ్గిస్తోంది. విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, పోషణ వంటి రంగాలకు బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులు కాగితాలపై మాత్రమే పెరుగుతున్నాయి. వాస్తవంగా ప్రజలకు చేరాల్సిన నిధులు మాత్రం తగ్గిపోతున్నాయి. ఇది సంక్షేమానికి నిబద్ధత కాదనీ, రాజకీయ ప్రదర్శన మాత్రమేనని ఆర్థిక నిపుణులు అంటున్నారు. మోడీ పాలనలో అప్పులు విపరీతంగా పెరుగుతున్నాయి. ఇలా భారీగా అప్పులు చేసి ఖర్చులను కూడా పెంచుతున్నది. అయితే ఆ ఖర్చు ప్రజల సంక్షేమంగా మారటం లేదు. ఈ ఏడాది కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ విషయంలో దీనిపై ఆర్థిక నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ఆర్థిక క్రమశిక్షణను చూపిస్తున్నట్టు ప్రభుత్వం చెప్తున్నా... వాస్తవంలో సంక్షేమ రంగాలకు కేటాయించిన నిధులు పూర్తిగా ఖర్చవడం లేదని విశ్లేషణలను బట్టి తెలుస్తున్నది.

బడ్జెట్ అంచనాల ప్రకారం 2026-27లో మొత్తం ప్రభుత్వ వ్యయం రూ.53.5 లక్షల కోట్లు, మూల ధన వ్యయం రూ.12.2 లక్షల కోట్లుగా ఉన్నది. ఆర్థిక లోటును జీడీపీలో 4.3 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం.. అప్పుజీడీపీ నిష్పత్తిని 55.6 శాతానికి పరిమితం చేస్తామని ప్రకటించింది. అయితే ఈ లక్ష్యాలు వాస్తవంలో సాధ్యమవుతాయా అన్న సందేహాలు నెలకొన్నాయి. విద్యకు రూ.1.39 లక్షల కోట్లు, ఆరోగ్యానికి రూ.1.05 లక్షల కోట్లు, వ్యవసాయానికి రూ.1.63 లక్షల కోట్లు, సామాజిక సంక్షేమానికి రూ.62.326 కోట్లు, గ్రామీణాభివృద్ధికి రూ.2.73 లక్షల కోట్లు కేటాయించినట్టు బడ్జెట్‌లో చూపించారు. కానీ గత అనుభవాల ప్రకారం బడ్జెట్ అంచనాల (బీఈ) నుంచి సవరించిన అంచనాలకు (ఆర్ఈ) వచ్చే సరికి ఈ రంగాలన్నింటిలోనూ ఖర్చులు తగ్గిపోతున్నాయి. 202526 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణాభివృద్ధి కేటాయింపులు రూ.2.65 లక్షల కోట్ల నుంచి రూ.2.12 లక్షల కోట్లకు పడిపోయాయి. సామాజిక సంక్షేమం, విద్య, ఆరోగ్యం, వ్యవసాయం వంటి కీలక రంగాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్)కు గ్రామీణ ఒత్తిడులు ఉన్నప్పటికీ.. బడ్జెట్ కేటాయింపుల్లో మాత్రం వాస్తవ పెరుగుదల కనిపించలేదు. కేంద్రంలో తొలిసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మోడీ ప్రభుత్వం దీనిని చిన్నచూపే చేస్తున్నది. క్రమక్రమంగా దీనిని నిర్వీర్యం చేయాలని చూస్తున్నదనే ఆరోపణలూ ఉన్నాయి. కాగా 2026-27లో దీనిని 'వికసిత్ భారత్ గ్రామీణ్' కార్యక్రమంలో కల్పడంతో నిజమైన వ్యయ పెరుగుదల ఎంత అన్నది స్పష్టంగా కనిపించడం లేదు. పీఎం-పోషణ్, అంగన్వాడీ పథకాలకు కేటాయించిన నిధులు వాస్తవ విడుదలల్లో తగ్గిపోవడంతో చిన్నారులు, మహిళల పోషణ స్థితి మెరుగుపడటం లేదు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5) గణాంకాల ప్రకారం పిల్లల్లో రక్తహీనత పెరగడం ఆందోళన కలిగిస్తోంది. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ అని చెప్తున్నా... నానాటికీ పెరుగుతున్న అప్పులు, ఆ అప్పులకు అయ్యే వడ్డీలు పెనుభారంగా మారుతున్నాయి. ప్రభుత్వ సంక్షేమ ఖర్చులకు అడ్డుగా నిలుస్తున్న ప్రధాన అంశం వడ్డీ చెల్లింపుల భారం. 2025లో రూ11.37 లక్షల కోట్లుగా ఉన్న వడ్డీ చెల్లింపులు.. 2026లో రూ.12.76 లక్షల కోట్లకు పెరిగాయి. దీనితో సంక్షేమానికి అదనపు నిధులు కేటాయించడం ఆర్థికంగా భారం అవుతున్నది. మోడీ ప్రభుత్వానికి ఆర్థిక ప్రణాళిక అనేది సరిగ్గా లేదని చెప్పడానికి ఇది ఒక ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తున్నదని ఆర్థిక నిపుణులు, మేధావులు వెల్లడిస్తున్నారు.

పీఎం-కిసాన్, ఆయుష్మాన్ భారత్, పీఎంపోషణ్ వంటి పథకాలకు స్వల్ప పెంపులు చూపించినా.. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే వాటి వాస్తవ విలువ తగ్గిపోయిందని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. ఆరోగ్యం, పోషణ, ఆదాయ భద్రత రంగాల్లో ఈ నామమాత్ర పెంపులు మానవాభివృద్ధి ఫలితాలను మార్చలేవని హెచ్చరిస్తున్నారు.

మొత్తంగా బడ్జెట్ 2026-27లో సంక్షేమ రాజ్యంగా కనిపించే ప్రయత్నం మోడీ ప్రభుత్వం చేసింది. కానీ అమలులో లోపాలు, వాస్తవ ఖర్చుల్లో కోతల కారణంగా ప్రజల జీవన ప్రమాణాల్లో గణనీయమైన మార్పు కనిపించడం కష్టమని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నిధుల కేటాయింపులు మాత్రమే కాదనీ, అవి నమ్మకంగా ఖర్చవడం కూడా సవాలుగా మారిందని వారు స్పష్టం చేస్తున్నారు. మోడీ ప్రభుత్వ పాలన ప్రజల అవసరాల కంటే రాజకీయ లాభాలకే ఎక్కువ పని చేస్తోందన్న అభిప్రాయం బలపడుతోంది. నినాదాలు, ప్రచారాలు కాకుండా నిజమైన ఉపాధి, బలమైన సంక్షేమం, సమాన అభివృద్ధి అవసరమని మేధావులు సూచిస్తున్నారు. అవి లేకుండా మోడీ ప్రభుత్వం నిరంతరం వినిపించే 'వికసిత్ భారత్' కేవలం ఖాళీ నినాదంగానే మిగిలిపోతుందని వారు హెచ్చరిస్తున్నారు.

# పీఎం కిసాన్ లబ్ధిదారుల్లో మరో రెండు లక్షల కోత

**అమరావతి, పతాకం న్యూస్:** సొంత భూమి కలిగిన రైతులకు పెట్టుబడి సాయం కింద మూడు కిస్తుల్లో ఏడాదికి రూ.ఆరు వేలు అందించే కేంద్ర పథకం 'పిఎంకిసాన్' లబ్ధిదారుల్లో మరో రెండు లక్షల మంది తగ్గిపోయారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తొలి కిస్తు (ఏప్రిల్-జులై) అందిన రైతులు 40,77,379 మంది కాగా అదే ఏడాది రెండవ కిస్తు (ఆగస్టు-నవంబర్) సొమ్ము 39,15,738 మందికే జమ అయింది. నాలుగు మాసాల వ్యవధిలో 1,61,641 మంది రైతులు ప్రభుత్వం అందించే పిసరంత సాయాన్నీ కోల్పోయారు. ఈ విడతలో సాయానికి అర్హులుగా 39,60,665 మందిని ఎంపిక చేయగా వారిలో 39,15,738 మందికే సొమ్ము జమ అయింది. అర్హులుగా గుర్తించిన వారిలో 44,927 మందికి బ్యాంకుల్లో సొమ్ము జమ కాలేదు. ఏతావాతా ఒకటవ కిస్తు కంటే రెండవ కిస్తుకు 2,06,560 మంది తగ్గిపోయారు. ఇదిలా ఉండగా పెట్టుబడి సాయానికి అర్హుల గుర్తింపులోనూ కోతలు కొనసాగుతున్నాయి. ఒకటవ కిస్తు కోసం రాష్ట్రం నుంచి 40,78,001 మందిని అర్హులుగా గుర్తించగా, రెండవ కిస్తుకొచ్చేసరికి అర్హులు 39,60,665 కి తగ్గిపోయారు. అర్హుల గుర్తింపులోనే 1,17,336 మంది తగ్గిపోయారు. ఇ-కెవైసి, ఆధార్ బేస్డ్ పేమెంట్స్ ఇత్యాది మోడీ ప్రభుత్వ ఆంక్షల వలన రాష్ట్రంలో పిఎంకిసాన్ లబ్ధిదారులకు లక్షల్లో కత్తెర పడుతోంది. 2019 ఎన్నికల ముంగిట మోడీ సర్కార్ పిఎంకిసాన్‌ను ప్రారంభించగా సంవత్సరానికి మూడు చొప్పున ఏడేళ్లల్లో 21 కిస్తుల్లో సొమ్ము జమ చేయగా లబ్ధిదారులు క్రమేపి తగ్గిపోతున్నారు. రాష్ట్రంలో 60,80,161 మంది రైతులు పిఎం కిసాన్ సాయానికి అర్హులని తొలినాళ్లల్లో ఎపి ప్రభుత్వం పేర్కొంది. 2022-23 ఆర్థిక సంవత్సరం తొలి కిస్తు (ఏప్రిల్-జులై) 46,62,768 మందికి జమ అయింది. వివిధ కారణాలతో 14 లక్షల మందికి సాయం ఎగరగొట్టారు. అదే ఏడాది రెండవ కిస్తు (ఆగస్టు-నవంబర్) 52,18,734 మందికి పడింది. అర్హుల్లో సుమారు 8 లక్షల మందికి సాయం చేయకుండా



ఎగనామం పెట్టారు. 2022-23 చివరి కిస్తునకు (డిసెంబర్-మార్చి) నుంచి ఇ-కెవైసి నిబంధన రావడంతో అర్హులు, లబ్ధిదారుల సంఖ్య కిస్తు కిస్తుకు భారీగా తగ్గుతోంది. ఈ కాలంలో వైసిపి, టిడిపి కూటమి రాష్ట్రంలో అధికారంలో ఉన్నాయి. పిఎంకిసాన్‌కు లబ్ధిదారులను గుర్తించే బాధ్యతను కేంద్రం రాష్ట్రాలకు అప్పగించింది. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు కేంద్రానికి అర్హుల సమాచారం పంపుతున్నప్పటికీ కేంద్రం వద్ద కోతలు పడుతున్నాయి. దీనిపై గత వైసిపి, ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వాలు కేంద్రాన్ని గట్టిగా అడగట్లేదు.పిఎంకిసాన్‌తో కలిపి రైతు భరోసాను వైసిపి సర్కార్ అమలు చేసింది. ప్రతిపక్షంలో ఉండగా ఆ విధానాన్ని విమర్శించిన టిడిపి, అధికారంలోకొచ్చాక వైసిపి బాటే పట్టింది. టిడిపి ప్రభుత్వం ఇప్పటి వరకు 'అన్నదాతా సుఖీభవ' పేరిట రెండు కిస్తుల్లో సొమ్ము జమ చేసింది. తమ లబ్ధిదారులు 46,85.838 గా ప్రకటించగా, వారిలో పిఎంకిసాన్ సాయం పొందినవారు 39,15,738 మంది మాత్రమే. కోతల వలన దాదాపు ఆరు లక్షల మంది పిఎంకిసాన్ సాయానికి దూరమయ్యారు. సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా ఏడాదిలో మొత్తం ఆర్థిక సాయం రూ.20 వేలు ఇస్తామనగా, రాష్ట్రం వాటా రూ.14 వేలతోనే రైతులు సరిబుచ్చుకోవాల్సి వచ్చింది. కేంద్రం సాయం అందక రూ.6 వేలు కోల్పోయారు. కౌలు రైతులకు ఇప్పటి వరకు రాష్ట్ర సర్కార్ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు.

# షుగర్ ఉన్నవారు జాగ్రత్తలను పాటించాలి!



డయాబెటిస్ ఉన్న వారు రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవడం చాలా ముఖ్యం. డయాబెటిస్ ఉన్న వారు చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవడానికి ఇన్సులిన్‌ను తీసుకుంటారు. ఇన్సులిన్ తీసుకున్నప్పటికీ చాలా మందిలో రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు ఎక్కువగా ఉంటాయి. ఇన్సులిన్ తీసుకున్నప్పటికీ డయాబెటిస్ ఉన్నవారిలో చక్కెర స్థాయిలు అధికంగా ఉండడానికి అనేక అంశాలు దారి తీస్తాయి. కనుక ఇన్సులిన్ తీసుకునే మోతాదుపై శ్రద్ధ వహించడం చాలా అవసరం. ఇక ఇన్సులిన్ తీసుకోవడంతో పాటు రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడానికి గల ఇతర కారణాలను తెలుసుకోవడం ముఖ్యం. డయాబెటిస్ నిర్వహణలో ఆహారం ముఖ్య పాత్ర పోషిస్తుంది. సరైన ఆహారాన్ని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి, సరైన ఆహారం తీసుకోవడం వల్ల శరీర బరువు కూడా అదుపులో ఉంటుంది.

ప్రాసెస్ చేసిన ఆహారాలను, జంక్ ఫుడ్ ను, క్యాలరీలు అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం తగ్గించాలి. మన జీవనశైలికి, రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉండేలా భోజన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, గింజలు, చేపలు వంటి వాటిని ఆహారంలో భాగంగా తీసుకోవాలి. అలాగే డయాబెటిస్ అదుపులో ఉన్నా లేదా అసలు లేకపోయినా కూడా రోజూ వ్యాయామం చేయాలి. వ్యాయామం చేయడం వల్ల రక్తంలో అదనంగా ఉండే చక్కెర స్థాయిలు తొలగించబడతాయి. వ్యాయామం చేయకపోవడం వల్ల శరీర బరువు పెరుగుతుంది. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. ఇన్సులిన్ తీసుకున్నప్పటికీ రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. కనుక రోజూ 15 నుండి 30 నిమిషాల పాటు మితమైన వ్యాయామం చేయడం మంచిదని వైద్యులు చెబుతున్నారు.

అలాగే ఒత్తిడి ఇన్సులిన్ విడుదల అవ్వకుండా అడ్డుకుంటుంది. దీంతో ఇన్సులిన్ తీసుకు న్నప్పటికి రక్తంలో చక్కెర స్థాయిలు అధికంగా ఉంటాయి. ఎంత ఒత్తిడికి గురైతే రక్తంలో చక్కెర స్థాయిలు అంత పెరుగుతూనే ఉంటాయి. ఇన్సులిన్ మోతాదు పని చేయకుండా పోతుంది. అందువల్ల ఒత్తిడి తగ్గడానికి యోగా, ధ్యానం, శ్వాస వ్యాయామాలు చేయాలి. అంతేకాకుండా ఇతర అనారోగ్య సమస్యలకు వాడే మందుల వల్ల కూడా రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. స్టెరాయిడ్స్, మందులు, ఆందోళన, నిరాశ, మానసిక సమస్యలకు వాడే మందులు, జనన నియంత్రణ మాత్రలు, బీటా బ్లాకర్లు , బి విటమిన్ క్యాప్సుల్స్ వంటివి రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి. కనుక వీటిని తీసుకునే ఉత్తమ మార్గాలను అన్వేషించడం మంచిది.

అలాగే ఏదైనా అనారోగ్య సమస్యతో బాధపడేటప్పుడు శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గుతుంది. దీంతో ఇన్సులిన్ నిరోధకత పెరుగుతుంది. ఇన్సులిన్ ను తీసుకున్నప్పటికి రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉంటాయి. ఇలా వివిధ కారణాల వల్ల ఇన్సులిన్ ను తీసుకున్నప్పటికి రక్తంలో చక్కెర స్థాయిలు అధికంగా ఉండే అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. కనుక చక్కెర స్థాయిలు అధికంగా ఉండడానికి గల కారణాలను తెలుసుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

# తెల్లజుట్టుతో ఇబ్బంది పడుతున్నారా?

ఈరోజుల్లో చిన్న వయస్సులోనే జుట్టు తెల్లబడుతుంది. దీంతో మానసిక ఆందోళనకు చాలామంది గురవుతున్నారు. తెల్ల జుట్టు రాకుండా కాపాడే నాలుగే నాలుగు చిట్కాలు, రోజూ పాటిస్తే జుట్టుకు రంగు వేయాల్సిన పనే లేదు. తెల్ల జుట్టు రావడా నికి అనేక కారణాలు ఉన్నాయి. శరీరంలోని మెలనిన్ ప్రభావితమైనప్పుడు జుట్టు బూడిద రంగులోకి మారడం ప్రారంభమవుతుంది. మెలనిన్ అనేది ఆరోగ్యకరమైన చర్మం, జుట్టును నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇక, విటమిన్ బి12, ఐరన్ లోపాలు, నిద్ర సమస్యలు, ఒత్తిడి, తరచుగా తలనొప్పి, కంటి చూపు సరిగా లేకపోవడం కూడా జుట్టు తెల్లబడటానికి దోహదం చేస్తాయి. తెల్ల జుట్టు తగ్గేందుకు నాలుగంటే నాలుగు ఫాలో అవ్వాలని డాక్టర్ సౌరభ్ సేథీ చెప్పారు. వృద్ధాప్యంలో జుట్టు నెరవడం సర్వసాధారణం. అయితే, ఈ రోజుల్లో చిన్న వయసులోనే చాలా మంది తెల్ల జుట్టు సమస్యతో బాధపడుతున్నారు. నిండా ముప్తై ఏళ్లు నిండకముందే తల మొత్తం తెల్ల జుట్టుతో నిండిపోతుంది. అనారోగ్యకరమైన జీవనశైలి, సరైన ఆహారం లేకపోవడం, రోజువారీ తప్పులు దీనికి కారణమని చెప్పొచ్చు. భారతదేశంలో నిరంతరం మారుతున్న వాతావరణం, కాలుష్యం కూడా తెల్ల జుట్టుకు అతిపెద్ద కారణాల్లో ఒకటి కావచ్చు. ఇక, తెల్ల జుట్టును నల్లగా మార్చుకోవడానికి చాలా మంది మార్కెట్లో దొరికే కెమికల్ డైలు వాడుతుంటారు. జుట్టుకు పదే పదే రంగు వేస్తుంటారు. ఇవి తాత్కాలికంగా జుట్టుకు రంగు ఇచ్చినప్పటికీ.. ఆ తర్వాత సమస్య మళ్లీ మొదటికొస్తుంది. అంతేకాకుండా జుట్టుకు రసాయన ఉత్పత్తులు వాడటం వల్ల.. భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవచ్చు. జుట్టు బలహీనపడటం, నిర్జీవమైన జుట్టు, జుట్టు రాలడం వంటి సమస్యలు తలెత్తవచ్చు. హార్వర్డ్‌లో శిక్షణ పొందిన డాక్టర్ సౌరభ్ సేథి తన యూట్యూబ్ ఛానెల్‌లో ఒక వీడియోను పంచుకున్నారు. ఇందులో నాలుగు విషయాలపై శ్రద్ధ పెట్టడం ద్వారా చిన్న వయసులోనే తెల్ల జుట్టు సమస్యను నివారించవచ్చని చెప్పారు. పూర్తి వివరాలపై ఓ లుక్కేద్దాం. డాక్టర్ సౌరభ్ సేథీ ప్రకారం.. శరీరం విటమిన్ బి12, ఫోలేట్ లోపం ఉంటే జుట్టు తెల్లబడవచ్చు. ఎందుకంటే ఈ రెండు పోషకాలు మెలనిన్ ఉత్పత్తికి సాయపడతాయి. మెలనిన్ జుట్టుకు నల్ల రంగును ఇస్తుంది. దీంతో, ఇవి రెండు తగ్గితే జుట్టు తెల్లబడుతుంది. అందుకే వీటి లోపాన్ని భర్తీ చేయాలి. విటమిన్ బి12 కోసం చేపలు, గుడ్లు, పాల ఉత్పత్తులు (పాలు, పెరుగు, జున్ను వంటివి) మీ ఆహారంలో భాగం చేసుకోండి. ఇక.. ఫోలేట్ కోసం, ఆకుకూరలు, కాయధాన్యాలు, శనగలు వంటివి తినాలని డాక్టర్ సూచించారు. ఫ్రీ రాడికల్స్ అనేవి శరీరంలోని కణాల్ని దెబ్బతీసే పదార్థాలు. ఇవి జుట్టు కుదుళ్ల ప్రభావితమైనప్పుడు.. మెలనిన్ ఉత్పత్తిని ఆపేస్తాయి. దీంతో, చిన్న వయసులోనే జుట్టు నెరవడం మొదలవుతుంది. ఈ సమస్యను నివారించడానికి బెర్రీలు, గింజలు, డార్క్ చాక్లెట్ వంటి యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆహారాల్ని భాగం చేసుకోండి. ఇవి ఫ్రీ రాడికల్స్‌ను తొలగించి జుట్టు మూలాల్ని బలోపేతం చేయడానికి సాయపడతాయి. అంతేకాకుండా ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. ఈ రోజుల్లో వర్క్ లైఫ్‌స్టైల్ కారణంగా చాలా మంది ఒత్తిడితో బాధపడుతున్నారు. జుట్టు తెల్లబడటానికి ఒత్తిడి కూడా ఒక ప్రధాన కారణం అంటున్నారు డాక్టర్ సేథీ. అధిక ఒత్తిడి శరీరంలో జుట్టు పెరుగుదల, మెలనిన్ ఉత్పత్తిని ప్రభావితం చేసే హార్మోన్లను విడుదల చేస్తుంది.అందుకే ఒత్తిడిని నిర్వహించడం చాలా ముఖ్యం. ఇందుకోసం ప్రతిరోజూ కనీసం 7 నుండి 8 గంటలు నిద్రపోవడానికి ప్రయత్నించండి.



# నైపుణ్యాలు పెంచుకుంటే.. డిగ్రీ విద్యార్థులకు కూడా లక్షల్లో జీతాలు



**విజయవాడ, పతాకం న్యూస్:** ఎన్ని డిగ్రీ పట్టాలు చేతిలో ఉన్నా ఉద్యోగం సాధించడం నేటి యువతకి కష్టంగా మారుతోంది. దీనికి ప్రధాన కారణం నైపుణ్యాల కొరత. ఇది కంపెనీలకు సైతం సవాలుగా మారుతోంది. పరిశ్రమల్లో ఖాళీలు ఉన్నా సరైన నైపుణ్యం కలిగిన ఉద్యోగులు లభించకపోవడం యజమానులకు ఇబ్బందికరంగా మారింది. ఇదే అంశాన్ని గుర్తించిన అనేక మంది విద్యార్థులు చదువుకునే రోజుల్లోనే ఉద్యోగాల సాధనకు అవసరమైన స్కిల్స్ అభివృద్ధి చేసుకుంటున్నారు. ఇటువంటి వారు డిగ్రీ పూర్తయిన నాటికే మంచి వేతనాలతో ఉద్యోగాలు సంపాదిస్తున్నారు. ఈ విద్యార్థులంతా డిగ్రీ చదువుతూనే క్యాంపస్ నియామకాల్లో ఉద్యోగాలు సాధించారు. వీరిలో కొంత మంది ఐదు నుంచి ఎనిమిది లక్షల రూపాయల వార్షిక వేతనాలతో రెండూ, మూడు కంపెనీల్లో ఉద్యోగాలు సంపాదించి సత్తాచాటారు. వీరంతా విజయవాడలోని ఆధిత్య డిగ్రీ కళాశాలలో డిగ్రీలో బీఎస్సీ(ఏఐ), డేటా సైన్స్, కంప్యూటర్ సైన్స్ బీబీఏ వంటి కోర్సుల్లో మూడో సంవత్సరం చదువుతున్నారు. మంచి కంపెనీల్లో మంచి వేతనాలతో ఉద్యోగాలు సాధించడం ఆనందంగా ఉందని ఈ విద్యార్థులు చెబుతున్నారు. జూన్ నెల నుంచి తాము ఉద్యోగాల్లో చేరుతామంటున్నారు. డిగ్రీ పూర్తి అయ్యేనాటికే తమకు ఉద్యోగాలు లభించడం పట్ల వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చదువుకునే రోజుల్లోనే వివిధ అంశాలపై పట్టు సాధించినట్లు విద్యార్థులు చెప్పారు. ఉద్యోగాల సాధనకు అవసరమైన నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన హ్యాక్‌థాన్‌లు, సెమినార్లలో పాల్గొంటూ తమకు తెలియని అనేక విషయాలు తెలుసుకున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా వివిధ అంశాలపై అవగాహనతో పాటు నూతన స్కిల్స్ అభివృద్ధి చేసుకున్నామన్నారు. ఈ ఉద్యోగాలు సాధించడంలో తమ తల్లిదండ్రులు, గురువుల ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. డిగ్రీ చదివే రోజుల్లో సమయాన్ని సక్రమంగా ఉపయోగించుకుంటే అనుకున్న లక్ష్యాన్ని సులువుగా చేరుకోవచ్చని అన్నారు.

తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్ బాగుండాలనే ఉద్దేశంతో ఎన్నో సవాళ్లను ఎదుర్కొని చదివిస్తారు. మంచి కంపెనీల్లో పెద్ద మొత్తంలో వేతనాలతో ఉద్యోగ అవకాశాలు లభిస్తే మురిసిపోతారు. తమ కష్టానికి ప్రతిఫలం లభించిందని భావిస్తారు. ఆ దిశగా విద్యార్థులు సైతం ఆలోచన చేయాలి. తరగతులకి అవసరమైన సిలబస్?తో పాటు ఉద్యోగాల సాధనకు అవసరమైన నైపుణ్యాలను తమ కళాశాలలో నేర్పిస్తున్నట్లు అధ్యాపకులు తెలిపారు.

తమ విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉందంటున్నారు. వారు భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు అందిపుచ్చుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. ఇంజనీరింగ్ వంటి కోర్సులే కాకుండా డిగ్రీలో ప్రత్యేకమైన విభాగాలు ఎంపిక చేసుకుని పూర్తి చేస్తే మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయని అధ్యాపకులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఉద్యోగాలు చేస్తూనే భవిష్యత్తులో వీటికంటే మెరుగైన, ఎక్కువ వేతనాలు లభించే ఉద్యోగాల కోసం ప్రయత్నం చేస్తామని ఈ విద్యార్థులు తెలిపారు. చదువుకునే రోజుల్లో నైపుణ్యాలు అభివృద్ధి చేసుకుంటే ఉద్యోగాల్లో చేరిన తరువాత ఉత్తమంగా రాణించేందుకు అవకాశం లభిస్తుంది.

# అత్యాచార నిందితుడ్ని కోర్టు ఆవరణలో చితకబాదిన న్యాయవాదులు...



**భోపాల్:** భోపాల్ జిల్లా కోర్టు ప్రాంగణంలో మంగళవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. మైనర్ బాలికపై అత్యాచారం, బ్లాక్‌మెయిల్ కేసులో అరెస్టయిన నిందితుడిని పోలీసులు కోర్టుకు తీసుకురాగా, ఆగ్రహంతో ఉన్న కొందరు న్యాయవాదులు, ప్రజలు అతడిపై దాడి చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, న్యాయవాదులకు మధ్య తీవ్ర తోపులాట జరిగింది.

వివరాల్లోకి వెళితే, కోహెఫిజా ప్రాంతంలో 11వ తరగతి విద్యార్థినిపై అత్యాచారం చేసిన కేసులో ఒసాఫ్ అలీ ఖాన్ అనే వ్యక్తిని పోలీసులు సోమవారం రాత్రి అరెస్ట్ చేశారు. మంగళవారం అతడిని కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకురాగా, అప్పటికే అక్కడ గుమిగూడిన కొందరు న్యాయవాదులు అతడిని చితకబాదారు. పోలీసులు నిందితుడిని రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఈ గందరగోళంతో కోర్టు కార్యకలాపాలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. ఎట్టకేలకు అతికష్టమ్మీద పోలీసులు నిందితుడిని కోర్టు లోపలికి తీసుకెళ్లారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

గతేడాది జూలైలో నిందితుడు తనపై అత్యాచారం చేశాడని, ఆ సమయంలో రహస్యంగా వీడియో తీసి దానిని అడ్డం పెట్టుకుని బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. వీడియో బయటపెట్టకుండా ఉండాలంటే లక్ష రూపాయలు డిమాండ్ చేయగా, భయంతో రూ. 40,000 ఇచ్చినట్లు తెలిపింది. అంతేకాకుండా, తన ఇష్టానికి విరుద్ధంగా ఇస్లామిక్ ప్రార్థనలు చేయమని బలవంతం చేశాడని ఫిర్యాదులో పేర్కొంది.

పోలీసులు నిందితుడిని కస్టడీలోకి తీసుకుని, అతడి మొబైల్ ఫోన్‌ను ఫోరెన్సిక్ విశ్లేషణ కోసం స్వాధీనం చేసుకున్నారు. బాధితురాలి స్నేహితురాలి ద్వారా నిందితుడికి ఆమెతో పరిచయం ఏర్పడినట్లు పోలీసులు తెలిపారు.




# దేశం కోసం మ్యాచ్‌లు, ట్రోఫీలు గెలిచే ప్రయత్నం కొనసాగుతుంది: రోహిత్




భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, దేశ అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన 'పద్మశ్రీ' అందుకోవడంపై తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు. ఇది తనకు, తన కుటుంబానికి చాలా ప్రత్యేకమైన క్షణమని, దేశం కోసం మ్యాచ్‌లు గెలిచే తన ప్రయత్నం ఎప్పటికీ కొనసాగుతుందని స్పష్టం చేశాడు. ఈ మేరకు ఓ వీడియోలో రోహిత్ మాట్లాడాడు. "పద్మశ్రీ పురస్కారం అందుకోవడం నాకు, నా కుటుంబానికి చాలా ప్రత్యేకమైన సందర్భం. ఈ గౌరవాన్ని అందించిన భారత ప్రభుత్వానికి ధన్యవాదాలు. నా కెరీర్‌లో ముఖ్యమైన పాత్ర పోషించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నాను. నా దేశం కోసం మ్యాచ్‌లు, ట్రోఫీలు గెలిచే నా ప్రయత్నం ఎల్లప్పుడూ కొనసాగుతుంది. ధన్యవాదాలు. జై హింద్" అని రోహిత్ పేర్కొన్నాడు.

2007లో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన రోహిత్ శర్మ, గత 19 ఏళ్లుగా భారత జట్టులో కీలక ఆటగాడిగా కొనసాగుతున్నాడు. బ్యాటర్‌గా, కెప్టెన్‌గా తనదైన ముద్ర వేశాడు. హిట్ మ్యాన్ సారథ్యంలోనే భారత జట్టు 2024లో టీ20 ప్రపంచకప్, 2025లో ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకుంది. రోహిత్ శర్మ ఇప్పటివరకు 67 టెస్టుల్లో 4,300 పరుగులు... 282 వన్డేల్లో 11,500 పరుగులు... టీ20ల్లో 4,231 పరుగులు సాధించాడు. ప్రస్తుతం టెస్టులు, టీ20 ఫార్మాట్‌లకు వీడ్కోలు పలికిన ఈ డాషింగ్ బ్యాట్స్ మన్ 2027 ప్రపంచకప్ లక్ష్యంగా వన్డేల్లో కొనసాగుతున్నాడు.

# భారత్-పాక్ టీ20 మ్యాచ్ విలువ రూ.4,500 కోట్లు!

## మ్యాచ్ బహిష్కరిస్తే ఐసీసీ టోర్నమెంట్ నిర్వహణ హక్కును పాక్ కోల్పోయే ప్రమాదం



టీ20 ప్రపంచకప్‌లో భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు తమ జట్టును అనుమతించమని పాకిస్థాన్ ప్రభుత్వం తేల్చిచెప్పడంతో ఐసీసీ కఠిన చర్యలకు సిద్ధమైంది. ఇందుకోసం పీసీబీకి ఐసీసీ 48 గంటలు తుదిగడువును విధించినట్లుగా తెలుస్తోంది. రేపు లేదా ఎల్లుండి ఐసీసీ సమావేశంకానున్నట్లు సమాచారం. పాక్‌ను అంతర్జాతీయ క్రికెట్ నుంచి బహిష్కరించే అవకాశమూ లేకపోలేదు. ఇదే జరిగితే ఐసీసీ టోర్నమెంట్లను నిర్వహించే హక్కులను పాక్ కోల్పోయే ప్రమాదముందని క్రికెట్ పండితులు విశ్లేషిస్తున్నారు.

పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో విదేశీ ఆటగాళ్లు పాల్గొనే విషయంలో నిరభ్యంతర పత్రాలు పొందడంలో ఐసీసీ ఆంక్షలు విధించే అవకాశం ఉంది. ఐసీసీ ఆదాయం నుంచి పాకిస్థాన్‌కు దక్కాల్సిన వాటాను సైతం నిలిపివేసే అవకాశం ఉంది. దీంతో పాకిస్థాన్‌కు తీవ్ర ఆర్థికనష్టం సంభవించే అవకాశముంది. పాకిస్థాన్‌ను అన్ని రకాల అంతర్జాతీయ క్రికెట్ నుంచి బహిష్కరించాలన్న నిర్ణయం ఐసీసీ తీసుకునే అవకాశం ఉంది. కొన్ని రోజుల్లో టోర్నీ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ సమస్యను పరిష్కరించడానికి ఐసీసీ తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోంది. ఫిబ్రవరి 15న పాక్ మైదానంలో దిగేలా ఒప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ప్రపంచ క్రికెట్‌లో భారత్-పాకిస్థాన్ మధ్య మ్యాచ్‌లకు ఉన్న డిమాండ్ అంతా ఇంతా కాదు. ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు సరిగా లేనప్పటికీ 2012 నుంచి ఐసీసీ, ప్రధాన టోర్నమెంట్లలో ఈ రెండు జట్లనూ ఒకే గ్రూపులో ఆడిస్తోంది. ప్రస్తుత పరిణామాల దృష్ట్యా భారత్-పాక్ మధ్య మ్యాచ్ జరగకపోతే అది క్రికెట్ వాణిజ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఒక్క భారత్-పాక్ మ్యాచ్ ఇతర దేశాల క్రికెట్ బోర్డులకు పరోక్షంగా ఆర్థిక సాయం చేస్తుందంటే, ఈ మ్యాచ్‌కు ఉన్న క్రేజ్‌ను అంచనా వేయెచ్చు. ప్రసార హక్కులు, ప్రకటనలు, స్పాన్సర్‌షిప్‌లు, టిక్కెట్లు, బెట్టింగ్ వంటి ఇతర వాణిజ్య కార్యకలాపాలను కలిపి చూస్తే ఒక్క భారత్-పాకిస్థాన్ టీ20 మ్యాచ్ విలువ సుమారు రూ.4,500 కోట్లు ఉంటుంది. మరే ఇతర క్రికెట్ మ్యాచ్ కూడా దీనికి దరిదాపుల్లోకి రాదు. ఈ మ్యాచ్ సమయంలో 10 సెకన్ల యాడ్ ధరే, దాదాపు రూ.25 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు పలుకుతుంది. ఒక్క భారత్-పాక్ మ్యాచ్ నుంచే ప్రకటనల ద్వారా రూ.300 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా. ఒకవేళ దాయాదుల మ్యాచ్ రద్దయితే, ప్రసారకర్తలకు తీవ్రమైన నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ప్రసారకర్తలు తమ డబ్బును వెనక్కి అడిగితే, ఆ నష్టాన్ని ఐసీసీ భరించాల్సి వస్తుంది. చివరకు అది సభ్య దేశాల బోర్డులపై పడుతుంది. ఐసీసీ ఆదాయం తగ్గితే, దానిపై ఆధారపడే చిన్న దేశాల క్రికెట్ బోర్డులకు నిధుల కొరత ఏర్పడుతుంది. అటు ఈ మ్యాచ్‌ను స్టేడియంలో వీక్షించేందుకు చాలామంది అభిమానులు ముందుగానే విమానాలు, హోటళ్లు, టిక్కెట్లు బుక్ చేసుకుంటారు. మ్యాచ్ జరగకపోతే అది పరోక్షంగా కొన్ని వేల మంది క్రికెట్ అభిమానులను నిరాశకు గురిచేస్తోంది. భారత్-పాక్ మ్యాచ్ జరగకపోతే రెండు బోర్డులు తక్షణమే సుమారు రూ.200 కోట్లు చొప్పున ఆదాయాన్ని కోల్పోతాయి. పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు ఏటా ఐసీసీ ఆదాయం నుంచి సుమారు 34 మిలియన్ డాలర్లు వస్తుంది.




# ఓటీటీలో దుమ్మురేపుతున్న 'శంబాల'



టాలీవుడ్ హీరో ఆది సాయికుమార్ కెరీర్‌లో చాలా కాలం తర్వాత వచ్చిన బిగ్ రిలీఫ్ మూవీ 'శంబాల'. థియేటర్లలో విడుదలైనప్పటి నుంచి ఊహించని స్థాయిలో ప్రేక్షకుల ఆదరణ పొందిన ఈ మిస్టరీ థ్రిల్లర్, మౌత్ టాక్ బలంతోనే మంచి కలెక్షన్లు రాబట్టి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్య పరిచింది. కమర్షియల్ పరంగా కష్టకాలం ఎదుర్కొంటున్న ఆది సాయి కుమార్‌కు ఈ సినిమా కెరీర్ టర్నింగ్ పాయింట్‌గా మారిందని సినీ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. దర్శకుడు యుగంధర్ ముని తెరకెక్కించిన 'శంబాల', ఆద్యంతం ఉత్కంఠను నిల బెట్టే కథనంతో ప్రేక్షకు లను సీటుకు కట్టిపడేసింది. ఆది నటనకు తోడు, శ్రీచరణ్ పాకాల అందించిన పవర్ ఫుల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఈ సిని మాను మరో లెవెల్‌కు తీసు కెళ్లింది. ఈ చిత్రంలో అర్చన అయ్యర్, మధు నందన్, రవి వర్మ కీలక పాత్రల్లో నటించి తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. సహనటులుగా అందరూ బలమైన పెర్ఫార్మెన్స్ ఇవ్వడంతో కథ మరింత ప్రభావవంతంగా మారింది. మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభిమోజు సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమా, కంటెంట్ మీద నమ్మకంతో తెరకెక్కిన ప్రాజెక్ట్‌గా నిలిచింది. " కథలోని మిస్టరీ ఎలిమెంట్స్, ట్విస్టులు, క్లైమాక్స్ వరకు సాగే టెన్షన్ సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. ముఖ్యంగా థ్రిల్లర్ జానర్‌లో ఆది సాయికుమార్ చూపించిన మెచ్యూర్డ్ పెర్ఫార్మెన్స్‌కు ప్రేక్షకుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి.

కీలక సన్నివేశాల్లో నేపథ్య సంగీతం కథ ఉత్కంఠను మరింత పెంచిందని సినీ అభిమానులు చెబుతున్నారు. అలాగే సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్ కూడా కథను బలంగా ముందుకు నడిపించడంలో కీలక పాత్ర పోషించాయి. థియేటర్లలో మంచి విజయం సాధించిన 'శంబాల', ఇప్పుడు ఓటీటీలోనూ సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫార్మ్ ఆహాలో విడుదలైన ఈ చిత్రం కేవలం 11 రోజుల్లోనే 100 మిలియన్ స్ట్రీమింగ్ నిమిషాలను నమోదు చేయడం సంచలనంగా మారింది. ఈ అచీవ్‌మెంట్‌తో ట్రేడ్ వర్గాలు మాత్రమే కాకుండా ఇండస్ట్రీ కూడా ఆశ్చర్య పోయింది. ప్రస్తుతం తెలుగులో స్ట్రీమింగ్‌లో దూసుకుపోతున్న 'శంబాల', త్వరలోనే హిందీ ప్రేక్షకులను కూడా పలకరించనుంది. ఈ సినిమా హిందీ వెర్షన్ స్ట్రీమింగ్ హక్కులను అమెజాన్ ప్రైమ్ వీడియో దక్కించుకున్నట్లు సమాచారం. త్వరలోనే హిందీలోనూ స్ట్రీమింగ్ ప్రారంభం కానుండటంతో, వ్యూవర్‌షిప్ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఒక వైపు థియేటర్లలో, మరోవైపు ఓటీటీలో భారీ విజయం సాధించడంతో 'శంబాల' ఆది సాయికుమార్ కెరీ ర్‌లో ఒక మైలురాయిగా నిలిచింది. చాలా కాలం తర్వాత ఒక స్ట్రాంగ్ కమర్షియల్ హిట్ ఖాతాలో పడటంతో ఆయన అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇకపై ఆది మరిన్ని కంటెంట్ ఓరియెంటెడ్, థ్రిల్లర్ సినిమాలపై దృష్టి పెట్టే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.

# శరవేగంగా 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' షూటింగ్



కథానాయకుడు ఫహాద్ ఫాజిల్ తన మొదటి స్ట్రెయిట్ తెలుగు సినిమా 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' షూటింగ్‌ను ప్రారంభించారు. హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన ప్రత్యేక సెట్‌లో ఈ షూటింగ్ ప్రారంభించగా తిలకించటానికి ఆయన అభిమానులు భారీగా వచ్చారు. అభిమానుల సందోహం మధ్యే ఆయన తన షూటింగ్‌ను కొనసాగింది. కాసేపు విరామం తీసుకుని ఫహాద్ తన అభిమానుల్ని పలకరించారు. అర్కా మీడియావర్క్స్, షోయింగ్ బిజినెస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. 'బాహుబలి' ఫ్రాంచైజీతో ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన నిర్మాతలు శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని ఈ సినిమాకు పనిచేస్తున్నారు. డైరెక్టర్ శశాంక్ యేలేటి అన్ని అంశాల మేళవింపుతో ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించనున్నారు. ఏప్రిల్ నాటికి షూటింగ్ పూర్తి చేస్తామని నిర్మాతలు చెబుతున్నారు. కాలా భైరవ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఈ ఏడాది ద్వితీయార్ధంలో విడుదల చేయబోతున్నారు.




# జయప్రద గ్లో వెనుక ఆసక్తికర విషయాలు



దాదాపు 300 సినిమాలు, 9 భాషల్లో నటించి దశాబ్దాల పాటు అగ్ర కథానాయికగా వెలుగొందారు జయప్రద. ఇప్పటికీ ఆమె అందం, తెరపై ఆమె చూపిన అభినయం చెక్కుచెదరలేదు. అయితే, ఆ గ్లో వెనుక ఏదో బ్యూటీ ప్రొడక్ట్ కాదు, కఠోర శ్రమ, అంకితభావం ఉన్నాయని ఆమె 'ప్రేమ ది జర్నలిస్ట్' ఇంటర్వ్యూలో వెల్లడించారు. కెరీర్‌లో అత్యంత బిజీగా ఉన్న సమయంలో షూటింగ్ కోసం విమానాలు, రైళ్లే తనకు మేకప్ రూములుగా మారిపోయిన సందర్భాలను ఆమె గుర్తుచేసుకున్నారు.

తన కెరీర్‌లో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'షరాబి' సినిమా షూటింగ్ నాటి ఓ సంఘటనను జయప్రద పంచుకున్నారు. ఫ్లైట్ ఆలస్యం కావడంతో ముహూర్తం షాట్‌కు సమయానికి చేరుకోవాల్సిన ఒత్తిడి నెలకొంది. దీనికి తోడు, మొదటిసారి అమితాబ్ బచ్చన్‌ను కలవబోతున్నాననే టెన్షన్‌తో "నిజంగా వణికిపోయాను" అని ఆమె చెప్పారు. ఆ సమయంలో తన మేకప్ ఆర్టిస్ట్ అందుబాటులో లేకపోవడంతో, ఫ్లైట్‌లోనే తనకు తానుగా మేకప్ వేసుకోవాల్సి వచ్చింది. తల్లిలాంటి తన హెయిర్‌డ్రెస్సర్ సహాయంతో మేకప్ పూర్తి చేసుకుని, 'ముఝే నౌలఖా' పాట చిత్రీకరణలో పాల్గొన్నట్లు తెలిపారు. 1980 నుంచి 1984 మధ్య కాలంలో జయప్రద షెడ్యూల్ ఎంత బిజీగా ఉండేదంటే, ఒక్క ఏడాదిలో ఏకంగా 15 సినిమాలు విడుదలయ్యాయి. ఆ రోజుల్లో విమాన సర్వీసులు పరిమితంగా ఉండటంతో రైళ్లు, బస్సుల్లోనే ఎక్కువగా ప్రయాణించేవారు. రోజుకు ఐదు షిఫ్టులు పనిచేయాల్సి రావడంతో, ప్రయాణంలోనే మేకప్ పూర్తి చేసే నైపుణ్యం సాధించారు. రాజమండ్రిలో ఎన్టీ రామారావు గారితో ఉదయం 4 గంటల షాట్‌కు వెళ్లేటప్పుడు, రైలు ఆగిన స్టేషన్లలో కనుబొమ్మలు, బేస్ మేకప్ వేసుకున్న సందర్భాలున్నాయని గుర్తు చేసుకున్నారు. షూటింగ్ పూర్తయిన వెంటనే మళ్లీ చెన్నై లేదా ఊటీలోని మరో సెట్‌కు బయలుదేరి వెళ్లేవారట. ఇంతటి కఠోర శ్రమ, నిద్రలేని రాత్రులు గడిపినా ఇప్పటికీ ముఖంలో అదే కాంతిని ఎలా కాపాడుకుంటున్నారని అడగ్గా, క్రమశిక్షణే కారణమని జయప్రద తెలిపారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**